Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 205 మేడ్చల్ మల్కాజ్‌గిరి 15 ఆగష్టు 2023 మంగళవారం పేజీలు : 4

### పాక్ సంక్షోభం.. కనిష్ఠ స్థాయికి పడిపోయిన రూపాయి

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేం దుకు వీలుగా అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి రుణాలు పొం దేందుకు పాక్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. తాజా పాకిస్థాన్ రూపా యి మారకపు రేటుపై నిబంధనను సరళతరం చేసింది. దీంతో డాలరుతో పాక్ రూపాయి మారకపు విలువ 255కి పడిపోయింది. పాక్ చరిత్రలో ఇంత పెద్దమొత్తంలో రూపాయి పతనం కావడం ఇదే తొలిసారి. ఐఎంఎఫ్ సూచన మేరకు పాకిస్థాన్ ద్రవ్యమారకపు రేటుపై నిబంధనలను సడలించింది. దీంతో ఒక్క రోజులోనే పాక్ రూపాయి రూ. 24 మేర క్షీణించినట్లు ట్రిబ్యూన్ వెల్లడించింది. రూపాయిపై పాక్ ప్రభుత్వం నియంత్రణలను సరళీకరించాలని, రూపాయి మారకపు విలువను మార్కెట్ నిర్ణయించేలా చూడాలని ఐఎంఎఫ్ పాకిస్థాన్‌ను కోరింది.

# రైతుబంధు ఇవ్వాలన్న ఆలోచన...

# కాంగ్రెస్ రాబందులకు వచ్చిందా..?

## నిప్పులు చెరిగిన మంత్రి కేటీఆర్



కామారెడ్డి : రైతుబంధు ఇవ్వాలన్న ఆలోచన కాంగ్రెస్ రాబందులకు ఎప్పుడైనా వచ్చిందా..? అని రాష్ట్ర మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. పది సార్లు ఓట్లేస్తే.. 50 ఏండ్లు కాంగ్రెస్ ఏలింది. కరెంట్ ఎప్పుడన్న సక్కగ ఇచ్చిందా..? మూడు గంటల కరెంట్ చాలని రేవంత్ రెడ్డి అమెరికా సాక్షిగా బయటపెట్టిండు. ఈ విషయాన్ని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రైతన్న ఆలోచించాలి అని కేటీఆర్ సూచించారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాకముందు కరెంట్ ఎట్ల ఉండే.. ఇప్పుడెలా ఉందో ఆలోచించాలన్నారు కేటీఆర్. ఎరువులు పంచే తెలివిలేదు. విత్తనాలు ఇచ్చే ముఖం లేదు. ఆఖరికి పోలీసు స్టేషన్లలో విత్తనాలు పంచిన దౌర్భాగ్యపు పాలన కాంగ్రెస్‌ది. నాడు పేలిపోయే ట్రాన్స్‌పార్మర్లు, కాలిపోయే మోటార్లు.. నెర్రెలు బారిన నేలలు.. నెత్తురు కారిన నేలలు.. నాడు తీవ్రమైన దుర్భిక్షం. ఇవాళ ఎక్కడా చూసినా పంటలతో తెలంగాణ పచ్చగా కళకళలాడుతోంది. భూగర్భ జలాలు పెరిగాయి. వ్యవసాయానికి సాగునీరు, 24 గంటల కరెంట్ అందుతుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**ఎవరు కావాలో ఆలోచించుకోండి.. ఆగం కాకండి..** కేసీఆర్ మూడు పంటలకు నీళ్లు ఇస్తున్నా అంటుండు.. 24 గంటల కరెంట్ ఉచితంగా ఇస్తున్నా అంటుండు. కాంగ్రెసోళ్లేమో మూడు గంటలు కరెంట్ అంటున్నారు. బీజేపోళ్లు హిందు, ముస్లిం అంటరు తప్ప వారికి ఇంకో మాట రాదు అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు కావాలి మీకు.. మూడు గంటల కరెంట్ ఇస్తానంటున్న కాంగ్రెసా.. మూడు పంటలు ఇస్తానంటున్నా కేసీఆరా.. మతం పేరిట మంటలు పెడుతానంటున్న బీజేపీనా.. ఎవరు కావాలో ఆలోచించండి.. ఆగం కాకండి.. రాబందులు కావాల్నా.. రైతుబంధు కావాల్నా ఆలోచించుకోవాలని కేటీఆర్ సూచించారు.

**కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దిక్కుమాలిన దళారీల రాజ్యమే..** కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి, రైతు బంధు, దళిత బంధు, బీసీ బంధు రద్దు చేస్తారని కేటీఆర్ పేర్కొన్నా. మళ్లా దిక్కుమాలిన దళారీల రాజ్యం, కుంభకోణాల కుంభమేళా తెరుస్తారు. గతంలో కరెంట్ ఎట్ల ఉండే. మంచినీళ్ల సమస్య ఎట్లుండే. సాగునీటికి ఎంత గోస ఉండే. కాంగ్రెస్ పరిపాలనను సినిమా రీల్ మాదిరిగా గుర్తుకు తెచ్చుకోండి అని కేటీఆర్ సూచించారు.

**దమ్ముంటే.. ప్రజలకు మీరేం చేశారో చెప్పి ఓట్లు అడగాలి..** 50 ఏండ్లు అధికారమిచ్చినా కాంగ్రెస్ ఏం చేయలేదు. ఇప్పుడు అధికారం ఇస్తే ఏం చేస్తారు..? 50 ఏండ్లలో చేసింది ఏమీ లేదు.. కానీ గడప గడపకు కాంగ్రెస్ అంట. కాంగ్రెస్ మాటలు వింటుంటే విచిత్రం అనిపిస్తుంది అని కేటీఆర్ ధ్వజమెత్తారు. షబ్బీర్ అలీ మంత్రి గా ఉన్నప్పుడు మెడికల్ కాలేజీ రాలేదు. కానీ కేసీఆర్ నాయకత్వంలో మెడికల్ కాలేజీ వచ్చింది. 9 ఏండ్లలో మేం ఏం చేశామో చెప్పాలంటే సమయం సరిపోదు. రైతుబీమా కింద రూ. 5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నాం. గతంలో సర్కార్ దవఖానాలకు వెళ్లే పరిస్థితి లేదు. ఇప్పుడు సర్కార్ దవఖానాలకు రోగుల సంఖ్య పెరిగింది. కంటి వెలుగు ద్వారా ఉచితంగా కండ్లద్దాలు అందించాం. ఈ ప్రోగ్రామ్ ద్వారా పెద్ద మనషులకు అండగా నిలబడ్డాం. దమ్ముంటే మీరు ప్రజలకు ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలి. అన్ని వర్గాలకు కేసీఆర్ ద్వారా మేలు జరిగింది. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా బీడీ కార్మికులకు, టేకేదార్లకు పెన్షన్లు ఇస్తున్నాం. సంక్రాంతికి గంగిరెద్దులు వచ్చినట్లు ఎన్నికలు రాగానే కాంగ్రెసోళ్లు మోపైతరు. వారు నోటికొచ్చినట్టు చెప్పే మాటలను నమ్మొద్దు అని కేటీఆర్ ప్రజలకు సూచించారు.

**ఎల్లారెడ్డిలో బీజేపీ డిపాజిట్ గల్లంతు కావాలియ...** నరేంద్ర మోదీ కూడా ప్రజలకు చేసిందేమీ లేదు అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. సిలిండర్ ధరలు పెరిగాయని మన్మోహన్ సింగ్‌ను తిట్టిండు. కానీ ఇవాళ సిలిండర్ ధర మాత్రం 1200 అయింది. నాడు గ్యాస్ బండకు మొక్కి కాంగ్రెస్‌కు పిండం పెట్టమని చెప్పిండో.. మళ్లీ మనం అదేపని బీజేపీకి చేయాలి. పిరపమైన ప్రధానికి ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలి. బీజేపీకి ఎల్లారెడ్డిలో డిపాజిట్ గల్లంతు కావాలి. అడ్డగోలుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారు. దీంతో నిత్యావసర ధరలు పెరిగాయి. ప్రధాని మంత్రికి, బీజేపీకి బుద్ధి చెబుతూ.. ఐదు దశాబ్దాలు మనల్ని ఏడిపించిన కాంగ్రెస్‌ను తిప్పికొట్టాలి. మనకున్నది ఒకే ఒక్క మార్గం.. రామబాణం కేసీఆర్. మన రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేది కేసీఆర్ మాత్రమే. ఢిల్లీ బానిసలతో ఏం కాదు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉంటే ఢిల్లీలో నిర్ణయాలు జరుగుతాయి. కానీ మనమే అధికారంలో ఉంటే.. తెలంగాణలోనే నిర్ణయాలు జరుగుతాయని కేటీఆర్ పేర్కొన్నారు.

**కేటీఆర్‌కు ఘన స్వాగతం :** మంత్రి కేటీఆర్ రోడ్డు మార్గం ద్వారా ఉదయం 11:15 గంటలకు కామారెడ్డికి చేరుకొని, నేరుగా ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌కు వెళ్లారు. అక్కడ 20 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకొని, అనంతరం అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేల సంఖ్యలో ప్రజలు, కళాకారులు, మెకానిక్‌లు, బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చారు. మంత్రికి అడుగడుగునా ఘనంగా స్వగతం పలికారు. అనంతరం మంత్రి ఎల్లారెడ్డి నియోజకవర్గానికి టూరిజం బస్సులో బయలుదేరి వెళ్లారు. దేవునిపల్లి వద్ద కొందరు కాంగ్రెస్ నాయకులు మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించగా, పోలీసులు వారిని తరిమికొట్టారు.




## పంచాయతీ సెక్రెటరీలు ఇక ప్రభుత్వ ఉద్యోగులే : మంత్రి హరీశ్‌రావు



మెదక్ : పంచాయతీ సెక్రెటరీలు ఇకపై ప్రభుత్వ ఉద్యోగులేనని, మరింత ఉత్సాహంతో కష్టపడి పని చేయాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మెదక్ నియోజకవర్గంలో 75 మంది పంచాయతీ సెక్రెటరీ రిజర్వేషన్ చేస్తూ ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో తెలంగాణ పల్లెలాంటి పల్లెలు కనపడవన్నారు. ప్రతి ఊర్లో ట్రాక్టర్ ట్రాలీ, నర్సరీ, డంప్ యార్డ్, వైకుంఠధామాలతో విజయవంతంగా పల్లెలను పరిశుభ్రంగా కాపాడుకుంటున్నామన్నారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా మాత్రమే కాకుండా సీజనల్ రోగాలు తగ్గాయన్నారు. వానాకాలం వచ్చిందంటే గతంలో రోగాలతో ఊర్లు వణికి పోతున్నాయంటూ వచ్చే వార్తలను చూసేవాళ్లమన్నారు. ప్రస్తుతం మిషన్ భగీరథ, పల్లె ప్రగతితో ఆ పరిస్థితి లేదన్నారు. పల్లెలలో అంటువ్యాధులు నిర్మూలించగలిగామని, ప్రతి తాండను గ్రామపంచాయతీ చేసుకొని.. కొత్త గ్రామ పంచాయతీలో సెక్రెటరీ ఉండాలని సీఎం కేసీఆర్ కొత్తగా 10వేల పోస్టులను భర్తీ చేశారన్నారు. దేశంలో 3శాతం జనాభా ఉన్న తెలంగాణకు 38శాతం అవార్డులు గ్రామపంచాయతీలకు వస్తున్నాయంటే సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 80వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని, డాక్టర్ల ఉత్పత్తిలో సైతం తెలంగాణ నెంబర్ వన్‌గా మారిందన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. తండ్రిలా ఆలోచించి సీఎం కేసీఆర్ ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తున్నారన్నారు. కల్మషం లేని ప్రేమ కేసీఆర్‌దని, ఉద్యోగం ఇచ్చింది కేసీఆరేనని.. మళ్లీ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసిందీ ఆయననన్నారు. ఒకప్పుడు బెంగాల్ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది అనే నానుడి దేశంలో నడిచిందని, ఇప్పుడు తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుందన్నారు. ఇది కేవలం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు.

# తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరాల్సిందే!



## పక్కా ప్లానింగ్‌తో రంగంలోకి కలనాధులు!!

హైదరాబాద్ : తెలంగాణా ఎన్నికలు బీజేపీకి జీవన్మరణ సమస్యగా మారాయి. ఎందుకంటే డిసెంబర్ లో తెలంగాణా ఎన్నికలు జరిగితే ఆ మీదట 2024 ఏప్రిల్ లో పార్లమెంట్ ఎన్నికలు ఉంటాయి. అంటే కచ్చితంగా నాలుగు నెలల సమయం కూడా ఉండకుండా లోక్ సభ ఎన్నికలు తరుముకు వస్తాయన్న మాట. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినా లేక గణనీయమైన సంఖ్యలో ఎమ్మెల్యేలను గెలిపించుకున్నా ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి హోప్ అండ్ స్కోప్ ఉంటాయి. కానీ అది కాస్తా తేడా కొడితే మాత్రం 2019లో వచ్చిన నాలుగు ఎంపీ సీట్లకు కూడా ఇబ్బంది అవుతుంది. అందుకే బీజేపీ తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల కోసం భారీ స్కెచ్ ని డిజైన్ చేసిందట. బడా నేతలు సీనియర్లు, ఎంపీలు, పార్టీ పెద్దలు ఇలా జనంలో పలుకుబడి ఉన్న వారిని అందరినీ తెచ్చి మరీ అసెంబ్లీ ఎన్నికల బరిలోకి బీజేపీ దింపబోతోందిట. ప్రస్తుతం ఎంపీలుగా ఉన్న నలుగురినీ ఎమ్మెల్యేలుగా పోటీ చేయించడానికి హై కమాండ్ రెడీగా ఉందిట. అలా చూసుకుంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరోసారి అంబర్ పేట అసెంబ్లీ నుంచి పోటీ చేయనున్నారు. అలాగే బండి సంజయ్ కరీం నగర్ లేదా వేములవాడ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నారని అంటున్నారు. ఇక ఈటెల రాజేందర్ హుజూరాబాద్ నుంచి పోటీ చేయనున్నారు. మరో ఎంపీ ధర్మపురి అరవింద్ ఆర్మూర్ లేదా కోరట్ల నుంచి పోటీ పడతారు. మాజీ ఎంపీ జితేంద్రరెడ్డి కుమారుడు వినయ్ రెడ్డికి కూడా అసెంబ్లీ టికెట్ ఇస్తారని సమాచారం. అలాగే జితేంద్రరెడ్డి మహబూబ్ నగర్ లేదా షాద్ నగర్ నుంచి పోటీ పడతారని తెలుస్తోంది. ఇక ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు బోధ్ లేదా అసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలో ఒక దాని నుంచి పోటీ చేయనున్నారని తెలుస్తోంది. కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు లేదా హైదరాబాద్ లోని ఎల్బీనగర్ నుంచి పోటీకి రెడీ చేసుకుంటున్నారట. ఎమ్మెల్యే రఘునందనరావు దుబ్బాక నుంచి పోటీకి మళ్లీ సిద్ధంగా ఉండమని అధినాయకత్వం చెప్పిందని అంటున్నారు. అదే విధంగా డీకే అరుణను గద్వాల అసెంబ్లీ నుంచి పోటీ చేయించాలని ప్లాన్ లో కమలనాధులు ఉన్నారని అంటున్నారు.

వీరితో పాటు సీనియర్ నేతలు ఇతర నాయకులు కూడా అసెంబ్లీ పోటీకి రెడీ కావాల్సిందే అని అధినాయకత్వం చెబుతోంది. వీరంతా బీజేపీకి గట్టి పట్టు ఉన్న అర్బన్ సెక్టార్ లతో పాటు హిందూత్వ భావన బలంగా ఉన్న చోట పోటీ చేస్తారు. తద్వారా బీజేపీకి మంచి నంబర్ లో విజయాలను నమోదు చేస్తారని అంటున్నారు. అలా ఎన్నికల్లో గణనీయంగా సీట్లను గెలుచుకునేందుకు మాస్టర్ ప్లాన్ బీజేపీ వేసిందని అంటున్నారు. చూడాలి మరి బీజేపీ ప్లాన్ ఎలా వర్కౌట్ అవుతుందో.

# సంపాదకీయం

## "హవానా సిండ్రోమ్"... భారత్ లో ప్రభావం...?

రోజు రోజుకీ కొత్త కొత్త రోగాలు పెరిగిపోతున్నాయని అంటుంటారు. సుఖం పెరిగే కొద్దీ సమస్య పెరుగుతుందని కొందరంటే... ఒత్తిడి పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఈ క్రమంలో తాజాగా హవానా సిండ్రోమ్ వ్యాధి తెరపైకి వచ్చింది. దీంతో... భారత్ లో దీని ప్రభావం ఎంతనే చర్చ మొదలైంది. అవును... అమెరికాతో పాటు పలుదేశాల అగ్ర నేతలు, దౌత్యకార్యాలయ అధికారులను హవానా సిండ్రోమ్ కలవరపెడుతోందని అంటున్నారు. దీంతో... భారత్ లోనూ ఈ మిస్టరీ సిండ్రోమ్ ప్రభావం ఉందా? అనే విషయంపై ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో... తాజాగా ఈ వ్యాదిపై భారత ప్రభుత్వం కూడా దృష్టి సారించింది. దర్యాప్తు చేస్తామని తెలిపింది. బెంగళూరుకు చెందిన అమర్నాథ్ చాగు అనే వ్యక్తి కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భారత్ లో హవానా సిండ్రోమ్ వ్యాప్తి, నిర్మూలన చర్యలపై దర్యాప్తు జరపాలని అందులో పేర్కొన్నారు. ఇటీవల ఈ పిటిషన్ విచారణకు రాగా.. దీనిపై కేంద్ర ప్రభుత్వం తన స్పందనను తెలియజేసింది. ఈ సిండ్రోమ్ ఉనికికి సంబంధించి మూడు నెలల్లో దర్యాప్తు పూర్తి చేస్తామని హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీంతో మరో సారి ఈ సిండ్రోమ్ వ్యవహారం చర్చనీయాంశమయ్యింది. ఇప్పుడు ఈ వ్యాది భారత్ లో కూడా ఉందా.. ఉంటే దాని తీవ్రత ఎలా ఉందనేది ఆసక్తిగా మారింది. కాగా... అమెరికా ఇంటెలిజెన్స్ తో పాటు వివిధ దేశాల దౌత్యకార్యాలయ అధికారులకు ఎదురైన మానసిక ఆరోగ్య లక్షణాలనే హవానా సిండ్రోమ్ గా వ్యవహరిస్తున్నారు. ఈ వ్యాది బారిన పడిన వారిలో... బయట ఎటువంటి శబ్దం లేకున్నా భారీ శబ్దం వినిపించడం, మైగ్రెయిన్, జ్ఞాపకశక్తి మందగించడం, మైకం వంటి లక్షణాలు కనిపిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యాది లక్షణాలు ఇలా ఉన్నప్పటికీ.. అందుకు కారణమైన కచ్చితమైన కారణాలు మాత్రం ఇప్పటివరకు గుర్తించలేకపోయారు. దీంతో ఇదో మిస్టరీగానే ఉండిపోయింది. అయితే, ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి వచ్చే మైక్రోవేవ్ తరంగాల కారణంగా ఈ పరిస్థితి తలెత్తుతోందని అమెరికా అనుమానిస్తోంది. అయితే అధిక ఫ్రీక్వెన్సీ కలిగిన ధ్వని తరంగాలు ఇందుకు కారణం కావొచ్చని కొందరి వాదన కాగా... హిస్టీరియా లేదా మానసిక వ్యాధికారణాల వల్ల ఈ సమస్య తలెత్తే అవకాశం ఉందని మరికొందరు నిపుణులు చెబుతున్నారు. ఏదేమైనా ఈ సమస్యకు స్పష్టమైన కారణాలు మాత్రం ఇంకా వెల్లడికాలేదు. ఈ సిండ్రోమ్ ను తొలిసారి క్యూబాలోని హవానా నగరంలోని అమెరికా దౌత్యకార్యాలయం సిబ్బందిలో గమనించారు. దీంతో ఆ నగరం పేరుమీదుగా దీన్ని "హవానా సిండ్రోమ్" గా పిలుస్తున్నారు.

## ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్.. టికెట్‌పై 50 శాతం రాయితీ



స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. పల్లె వెలుగు బస్సు సర్వీసుల్లో 60 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు టికెట్‌లో 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపింది. హైదరాబాద్ నగరంలో 24 గంటల పాటు అపరిమిత ప్రయాణానికి అందించే టీ-24 టికెట్‌ను అందరికీ కేవలం రూ.75కే ఇవ్వాలని నిర్ణయించింది. పిల్లలకు మాత్రం టీ-24 టికెట్‌ను రూ.50కే అందజేయనున్నది.

పూర్తి వివరాలకు టీఎస్‌ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సూచించారు.

## టీచర్లు పెళ్లి చేసుకుంటేనే బదిలీ అంటే ఎలా?: హైకోర్టు



హైదరాబాద్: బదిలీల ప్రక్రియలో ఏ ప్రాతిపదికన టీచర్ల మధ్య వివక్ష చూపిస్తున్నారని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. టీచర్లు పెళ్లి చేసుకుంటేనే బదిలీ చేస్తామంటే ఎలా? అని నిలదీసింది. భార్యాభర్తలు ఒకేచోట ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అదనపు అడ్వొకేట్ జనరల్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధ్యాయ దంపతులకు అదనపు పాయింట్లు ఇచ్చినట్టు తెలిపారు. బదిలీలకు సంబంధించి నిబంధనలను సవరించామని.. వాటిని అసెంబ్లీ కౌన్సిల్ ముందు ఉంచినట్లు కోర్టుకు వివరించారు. ఈ మేరకు నిబంధనల మార్పులపై ఏజీ కోర్టుకు మెమో సమర్పించారు. స్టే ఉన్నందున బదిలీల ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. ఎన్నికలు వస్తున్నందున త్వరగా విచారణ చేపట్టాలని ధర్మాసనాన్ని కోరారు. ఏజీ.. మెమో, కౌంటర్లు ఇవాళే ఇచ్చినందున కొంత సమయం కావాలని పిటిషనర్లు న్యాయస్థానాన్ని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ నెల 23న బదిలీలపై వాదనలు వింటామని తెలిపింది.

## కేంద్రంలో బీఆర్ఎస్ కీలకమా ?




రాబోయే ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించబోతున్నట్లు మంత్రి కేటీయార్ చెప్పారు. బీఆర్ఎస్ మద్దతులేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటయ్యే అవకాశాలు లేవంటున్నారు. ఇదే పద్దతిలో కేసీయార్ కూడా పదేపదే ప్రకటనలు ఇస్తున్న విషయం తెలిసిందే. కేంద్రప్రభుత్వంలో బీఆర్ఎస్ పాత్ర ఏ విధంగా కీలకంగా ఉండబోతోందో చెప్పమంటే మాత్రం చెప్పటం లేదు. అందుబాటులోని సమాచారం, గ్రౌండ్ రియాలిటీ ప్రకారం చూస్తే తండ్రి, కొడుకులు ఇద్దరు ఏదో నోటికొచ్చింది చెబుతున్నట్లే అనుమానంగా ఉంది. ఎందుకంటే లాజికల్ గా వీళ్ళు చెప్పేది నిజమవుతుందని కాదు చివరకు దగ్గరగా ఉందని కూడా అనిపించటంలేదు. రెండు జాతీయ పార్టీలకు కాలం చెల్లిందని కేటీయార్ అన్నారు. కాబట్టి కేంద్రంలో కొత్త సంకీర్ణం ఆధ్వర్యంలోనే ప్రభుత్వం ఏర్పాటవుతుందని మంత్రి జోస్యం చెప్పారు. ఆ కొత్త సంకీర్ణంలోనే బీఆర్ఎస్ చాలా కీలకపాత్ర పోషించబోతోందన్నారు. జాతీయ మీడియా నిర్వహిస్తున్న అనేక సర్వేల్లో మళ్ళీ ఎన్డీయేనే అధికారంలోకి రావటం ఖాయమని తెలుస్తోంది. సర్వేలన్నీ ప్రతిసారి నిజమవ్వాలని గ్యారెంటీఏమీలేదు. కాకపోతే ఎన్డీయేని ఢీకొట్టేంత సీన్ ప్రస్తుత ఇండియాకూటమి, ప్రతిపక్షాలకు లేదు. రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీల మధ్య పోటీచేసే సీట్లు పర్ఫెక్టుగా సెట్టయితే అప్పుడు ఎన్డీయే అభ్యర్ధులకు మంచి పోటీ ఇవ్వగలదని అనిపిస్తోంది. అప్పుడు కూడా ఇండియా కూటమి అధికారంలోకి వచ్చేస్తుందని ఎవరు అనుకోవటంలేదు. కాకపోతే ప్రతిపక్షాల మధ్య మంచి అవగాహన ఏర్పడితే ఎన్డీయే బలం తగ్గితే తగ్గవచ్చని అనుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో బీఆర్ఎస్ పాత్ర ఉండే అవకాశమే లేదు. ఎందుకంటే ఇటు ఎన్డీయే అటు ఇండియా కూటమి రెండూ కేసీయార్ ను దూరం పెట్టేశాయి. రేపటి ఎన్నికల్లో తెలంగాణాలో కేసీయార్ హ్యాట్రిక్ విజయం సాధించడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ ఎంపీ సీట్లను గెలుచుకోవాలి. అప్పుడే కేసీయార్ వైపు ఎవరైనా చూస్తారు. లేకపోతే పై రెండింటిలో ఏది జరగకపోయినా జాతీయ రాజకీయాల్లో కేసీఆర్ ఉనికే ప్రశ్నార్ధక మైపోవటం ఖాయం. వాస్తవం ఇలాగుంటే తండ్రి, కొడుకులు మాత్రం ఏదేదో చెప్పేస్తున్నారు.

## మోకిల ఫేజ్-2లో మరో భారీ భూవేలానికి నోటిఫికేషన్.. గజం ఎంతంటే?




హైదరాబాద్: రాష్ట్ర రాజధానిలో మరో భారీ భూవేలానికి తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. మోకిల ఫేజ్-2లో 300 ప్లాట్ల అమ్మకానికి హెచ్ఎండీఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తంగా 300 ప్లాట్లలో 98,975 గజాలను ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. 98,975 గజాల అమ్మకంతో రూ.800 కోట్లు ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

లేఅవుట్‌లో 300 నుంచి 500 గజాల వరకు ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. వేలంలో పాల్గొనేందుకు ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. రూ.1,180 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని హెచ్ఎండీఏ నోటిఫికేషన్‌లో పేర్కొంది. రిజిస్ట్రేషన్‌తో పాటు రూ.లక్ష డిపాజిట్ చేయాలని తెలిపింది. చదరపు గజానికి రూ.25 వేలు కనీస ధరగా హెచ్ఎండీఏ నిర్ణయించింది. మోకిల తొలి ఫేజ్ వేలంలో గరిష్ఠంగా గజానికి రూ.1.05 లక్షలు, కనిష్ఠంగా రూ.72 వేలు పలికిన సంగతి తెలిసిందే.

## ఆలయంపై పడిన కొండచరియలు: 9 మంది మృతి.. శిథిలాల కింద మరో 20 మంది!

శిమ్లా: భారీ వర్షాలతో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం అతలాకుతలమవుతోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న కుంభవృష్టికి పలు చోట్ల విపత్కర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా శిమ్లాలోని ఓ ఆలయంపై కొండచరియలు విరిగిపడి 9 మంది మృతిచెందారు. సోమవారం ఉదయం సమ్మర్ హిల్ ప్రాంతంలోని శివాలయంపై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆలయం కుప్పకూలి పలువురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారమందుకున్న పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 9 మృతదేహాలను వెలికితీయగా.. శిథిలాల కింద మరో 20 మందికి పైనే ఉన్నట్లు తెలిపారు. వారి కోసం గాలిస్తున్నారు. ఉత్తర భారతంలో నేడు శ్రావణ సోమవారం కావడంతో ఉదయం నుంచే శివాలయానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చారు. ప్రమాద సమయంలో ఆలయం వద్ద దాదాపు 50 మంది వరకు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. ఆలయం కూలిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి సఖ్వీందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శిథిలాలను తొలగించి ప్రజలను రక్షించేందుకు స్థానిక యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోందని తెలిపారు. ఘటనాస్థలాన్ని సీఎం పరిశీలించారు. వర్ష పరిస్థితుల దృష్ట్యా నదీ పరివాహక ప్రాంతాలు, కొండల ప్రాంతాలకు వెళ్లొద్దని ప్రజలను సూచించారు. పలు ప్రాంతాల్లోనూ వర్ష సంబంధిత ఘటనల్లో మరణాలు సంభవించాయి.

హిమాచల్‌లో 24 గంటల వ్యవధిలోనే 21 మంది మృతి చెందారని ముఖ్యమంత్రి సుఖు తెలిపారు. ఆదివారం సోలన్ జిల్లాలోని జాదోన్ గ్రామంలో కురిసిన కుంభవృష్టికి ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. గడిచిన 24 గంటల్లో శిమ్లాలో 131.6 మి.మీల వర్షపాతం నమోదైంది. నేడు, రేపు కూడా అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం నేడు స్కూళ్లకు సెలవు ప్రకటించింది. భారీ వర్షాలు, కొండచరియల కారణంగా దాదాపు 750 రోడ్లపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల హిమాచల్‌లో భీకర వర్షాలు రాష్ట్రాన్ని వణికించిన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వల్ల రూ.7,020.28 కోట్ల నష్టం వాటిల్లింది. వర్ష సంబంధిత ఘటనల్లో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు.

## నల్గొండ.. దుమ్మే నిండా..!

నల్గొండ: హైదరాబాద్ మహానగరం తర్వాత రాష్ట్రంలో అత్యధికంగా కాలుష్యం నమోదవుతున్న ప్రాంతాల్లో ఉమ్మడి జిల్లానే తొలిస్థానంలో ఉందని గతంలోనే కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకటించింది. ప్రస్తుతం ఇక్కడి పరిస్థితులతో త్వరలోనే నల్గొండ రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలుస్తుందనడంలో సందేహం లేదు. రహదారి నిర్మాణ వ్యర్థాలతో పాటూ పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో పట్టణంలో రోజురోజుకూ వాయు నాణ్యత సూచీ (ఏయిర్ క్వాలిటీ ఇండెక్స్ - ఏక్యూఐ) పడిపోతోంది. సాధారణంగా గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 0-50 వరకు ఉంటేనే అది మంచి గాలి.

దీని వల్ల ఎవరికీ ఏ ఇబ్బందులుండవు. కానీ నల్గొండలో గత పక్షం రోజులుగా నిత్యం 130 - 150 ఏక్యూఐ నమోదవు తోంది. గతేడాది డిసెంబరు 28న గరిష్ఠంగా 175 ఏక్యూఐ నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి నివేదిక వెల్లడించడం గమనార్హం. గత పది నెలలుగా పట్టణంలో రహదారి విస్తరణ పనులు జరుగుతుండటం, పనుల్లో దార్శనికత కొరవడటం, మధ్యమధ్యలో ఆపివేస్తూ ఏ రహదారినీ పూర్తి చేయకపోవడంతోనే ఈ పరిణామాలు సంభవిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. పట్టణంలో ఏ రహదారి చూసినా దుమ్ము, ధూళితోనే కనిపిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్‌కు సైతం తీవ్ర అంతరాయం కలుగుతోంది. మరోవైపు గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే పనుల్లో జాప్యం నెలకొంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెరిగిన కాలుష్యానికి తోడు, ఉష్ణోగ్రతలు తగ్గడంతో గుండెజబ్బులు, శ్వాసకోస ఇబ్బందులున్న వారు ఆసుపత్రుల పాలవుతున్నారు.

ప్రమాదకరంగా పీఎం 10 కాలుష్య రేణువులుకాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) పరిమితుల ప్రకారం సూక్ష్మధూళి కణాల(పీఎం 10) వార్షిక సగటు ఘనపు మీటరు గాలిలో 60 మైక్రోగ్రాములకు మించరాదు. అంతకు తక్కువగా పీఎం 10 స్థాయి ఉంటే ఆ గాలి స్వచ్ఛమైనది. అంతకంటే ఎక్కువగా ఉంటే అది పలు కాలుష్య కారకాలతో నిండి ఉందని అర్థం. గడిచిన మూడు రోజులుగా పీఎం 10 నల్గొండ పట్టణంలో 72కు పైగా నమోదవడం గాలిలో కాలుష్య తీవ్రతను తెలియజేస్తోంది. పట్టణంలో కాలుష్యాన్ని నియంత్రించాల్సిన పురపాలిక, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు తగు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ప్రజలు కార్యాలయాలకు, పాఠశాలలకు వెళ్లే సమయంతో పాటూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఏక్యూఐ దారుణంగా పడిపోతోంది.

## ఆయనదంతా ప్రత్యేక నిఘా..!

నల్గొండ : జిల్లా పోలీసు ఉన్నతాధికారికి కళ్లు, చెవులుగా ఉండే విభాగంతో పాటూ మరో రెండు కీలక విభాగాలకు అధిపతి ఆయన. రెండు నెలల పాటూ ఉన్నతాధికారి అందుబాటులో లేకపోవడంతో సదరు అధికారే ఉన్నతాధికారిగా వ్యవహరించనట్లు సంబంధిత అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ రెండు, మూడు నెలల నుంచి ఆయన వ్యవహారశైలి వివాదాస్పదంగా మారిందన్న ఆరోపణలు తీవ్రమయ్యాయి. మూడు నెలల క్రితం అక్రమ గంజాయి కేసులో కోదాడకు చెందిన అధికార పార్టీ యువనేతను పోలీసులు నిందితుడిగా పట్టుకున్నారు. ఈ కేసు విచారణలో హైదరాబాద్‌లో పేరున్న ఓ పార్టీ యువనేత కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులకు ఆధారాలు దొరకడంతో..ఆయన వద్ద రూ.5 లక్షలు తీసుకొని కేసులో ఆయన్ను తప్పించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయం నల్గొండతో పాటూ సూర్యాపేట ఉన్నతాధికారులకు లోతుగా కేసును విచారిస్తున్న సమయంలో తెలియడంతో సదరు అధికారిని తీవ్రంగా మందలించినట్లు సమాచారం.

హైదరాబాద్‌లో తాను కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి ఉమ్మడి జిల్లాలోని ఇసుక రీచుల లారీల ద్వారా ఇసుకను సరఫరా చేసుకోవడంతో పాటూ నెలనెలా మామూళు తీసుకున్నటు సమాచారం. ఇటీవలే ఉన్నతాధికారి



పేరు చెప్పి విచారణ చేయాలంటూ .. సదరు శాఖ అధికారులతో పాటూ గుత్తేదారులను బెదిరించి భారీగా వసూలు చేస్తున్నట్లు తెలియడంతో ఆ రీచులు తమ పరిధిలోకీ వస్తుండటంతో.. పక్క జిల్లా 'నిఘా' అధికారులు ఇటీవలే ఓ నివేదికను హైదరాబాద్ ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం.

ఉన్నతాధికారికి తెలియకుండా ఏకంగా ఓ ఎస్ఐని మండలానికి ఇన్‌ఛార్జిగా నియమించిన ఘటనలో సదరు ఎస్సైను సస్పెండ్ చేయడంతో పాటూ ఆ పరిధి పోలీసు అధికారికి తాఖీదులు జారీ చేయడం జిల్లా పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలోనూ సదరు అధికారి భాగస్వామిగా ఉన్నట్లు తేలిందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

గత నాలుగైదు నెలలుగా జిల్లాలో భారీగా పట్టుబడిన గంజాయి కేసులతో పాటూ నార్కట్‌పల్లిలో కేజీ బంగారం చోరీ అయిన ఘటనలో నిందితులను ముడుపులు తీసుకొని వదిలేసినట్లు సమాచారం. గతంలో పక్క జిల్లాలో పనిచేసిన సందర్భంలోనూ తీవ్రంగా అవినీతి ఆరోపణలు వచ్చినా ఎక్కడా ఆధారాలు దొరక్కపోవడంతో తప్పించుకున్నాడని శాఖలోని అధికారులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండటం విశేషం. మరోవైపు జిల్లాలో వ్యాపార కార్యకలాపాలు ఎక్కువగా ఉండే మిర్యాలగూడ, నల్గొండ, చండూరు ప్రాంతాలతో పాటూ జాతీయ రహదారిపై ఉండే పోలీసుస్టేషన్ల నుంచి నెలనెలా తనకు తప్పకుండా మామూళ్లు రావాలని ఇటీవలే హుకూం జారీచేసినట్లు అక్కడ పనిచేసే ఓ పోలీసు అధికారి వెల్లడించారు. సదరు అధికారితో జిల్లాలోని మరో రెండు డివిజన్లలోని కొందరు అధికారులు సైతం స్థానికంగా భూదందాలు చేస్తున్నట్లు రాష్ట్ర ఇంటెలిజెన్స్ చేసిన విచారణలో తేలడంతో ఒకట్రెండు రోజుల్లో జిల్లాలోని పలువురు అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

## పాలకవర్గం లేక.. ప్రత్యేక అధికారులు రాక

సూర్యాపేట : నకిరేకల్ మండంలోని ఏడు గ్రామాల్లో రెండేళ్ల నుంచి ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. నల్గొండ జిల్లాలో పాలకవర్గాలు లేని గ్రామ పంచాయతీలు కేవలం నకిరేకల్ మండలంలోనే ఉండటం గమనార్హం. మండలంలోని చందుపట్ల, తాటికల్, చందంపల్లి, నెల్లిబండ, కడపర్తి, నోముల, గొల్లగూడెం గ్రామాలకు 2019లో ఇతర పంచాయతీలతో పాటు ఎన్నికలు జరగలేదు. ఈ పంచాయతీలు 2011లో నకిరేకల్ పురపాలికలో విలీనమయ్యాయి. అశాస్త్రీయంగా గ్రామాలను విలీనం చేశారని స్థానికులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో 2013లో గ్రామాల విలీనాన్ని న్యాయస్థానం రద్దుచేసి గ్రామ పంచాయతీలను పునరుద్ధరించింది. వీటికి 2015లో ఎన్నికలు జరిగాయి. 2020 డిసెంబరు 15తో ఈ గ్రామాల్లో పాలకవర్గాల గడువు ముగియడంతో డిసెంబరు 16, 2020 నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది. రెండేళ్ల నుంచి అధికారుల పాలనలోనే ఈ గ్రామాలున్నాయి. ఇది తాటికల్ గ్రామ పంచాయతీ కార్యాలయం. కనీసం బోర్డు కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు. నకిరేకల్- సాగర్ హైవే విస్తరణలో ఈ గ్రామంలోని పంచాయతీ భవనాన్ని తొలగించారు. అప్పటి నుంచి గ్రామంలో ఉన్న శిథిల పీఏసీఎస్ భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. నష్టపరిహారంగా రూ.10 లక్షలు డీపీవో ఖాతాలో జమ చేసినా.. పాలకవర్గం లేకపోవడంలో ఏడాది నుంచి నిధులు మూలుగుతున్నాయి.

పత్తాలేని అధికారులు..ప్రత్యేక అధికారుల పాలన అస్తవ్యస్తంగా మారింది. మండల, డివిజన్ స్థాయి అధికారులకు సర్పంచుల స్థానంలో ఈ గ్రామాల ప్రత్యేక అధికారులుగా బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. వారు సొంతశాఖల పనుల్లో తీరికలేకుండా ఉండటంతో గ్రామాల పాలనకు సమయం కేటాయించలేకపోతున్నారు. సర్పంచి, పాలకవర్గం లేకపోవడంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కొరవడుతోంది. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు రాకపోవడంతో భారం అంతా కార్యదర్శులపై పడుతోంది. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిదీపాల సమస్యలు సకాలంలో పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. సర్పంచులు ఉంటే గ్రామాల్లో ఇళ్ల మధ్య ప్రహరీల హద్దుల వివాదాలు, కుటుంబ కలహాలు, సామాజిక వర్గాల వివాదాలను గ్రామ స్థాయిలోనే ఇరువర్గాలతో చర్చించి పరిష్కరించేవారు. ఇప్పుడు ప్రతి చిన్న సమస్యకు పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు పేర్కొన్నారు.

# వెనుక జలాలు ముంచేస్తున్నాయి..!

జయశంకర్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద పొలాలపైకి పోటెత్తింది. ఓవైపు వాగులు.. మరోవైపు గోదావరి జలాలు రైతులపై పగబట్టినట్లు ఏటా పంటలను ముంచుతున్నాయి. ఇసుక మేటలతో కప్పేస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలు సైతం ముంపునకు కారణమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లుగా ఏనాడూ పంటలు చేతికి రాలేదని వాపోతున్నారు. ఏటా ప్రభుత్వం, అధికారులు పరిష్కారం చూపుతారని ఆశతో ఎదురుచూస్తున్నారు.నాలుగు మండలాలపై ప్రభావం..: కాళేశ్వరం బ్యారేజీల వెనుక జలాలతో స్థానిక వాగుల వరద గోదావరిలో కలవడం లేదని.. పంటలను కమ్మేస్తోందని రైతులు చెబుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహాదేవపూర్, పలిమెల, మల్హర్ మండలాల్లో పంటలు ముంపునకు గురవుతున్నాయి. ఈ ఏడాది నాలుగు మండలాల్లో దాదాపు 2 వేల ఎకరాల్లో పత్తి పంట, వరినారు మళ్లు దెబ్బతినగా.. దాదాపు వెయ్యి ఎకరాల్లో ఇసుక మేట వేసిందని అంచనా. 2019 నుంచి బ్యారేజీల నుంచి పంపుల ద్వారా ఎగువ ప్రాంతాలకు నీటిని ఎత్తిపోస్తున్నారు. ఈ నీటినిల్వలు ఉండటం, గోదావరిలో కలిసే సమీప వాగులు, వంకలు వరద ఉద్ధృతితో పోటు కమ్ముతోంది. బ్యారేజీల గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినప్పుడు సైతం కిందిభాగంలోని తీరప్రాంతాల్లోనూ ముంపు ప్రభావం పడుతోంది. కనీసం పంట నష్ట పరిహారం కూడా చెల్లించడం లేదు.



రూ.రెండు లక్షల నష్టం

ఈ రైతు పేరు బాసాని రవి. కాటారం మండలం దామరకుంట ఎంపీటీసీ సభ్యుడు. వారం కిందట మానేరు వాగు ఉప్పొంగడంతో సుమారు రూ.2 లక్షలు నష్టపోయారు. ఆరెకరాల్లో పంట వేద్దామని అంతా సిద్ధం చేసుకున్నారు. వరదలో పొలాలన్నీ ఇసుక మేటలు వేశాయి. 20 బస్తాల విత్తనాలు అలికి నారు సిద్ధం చేశారు. అదంతా కొట్టుకుపోయింది. విద్యుత్తు మోటారు, నియంత్రిక, నాలుగు స్తంభాలు పూర్తిగా ధ్వంసమయాయి. ఆరెకరాల్లో రెండెకరాల్లో ఇసుక మేటలు వేయగా.. మిగిలిన నాలుగెకరాలు పంట వేయడానికి పనికి రాకుండా తయారైంది. ఏటా ఇదే పరిస్థితి.

కౌలు రైతు కష్టం

ఈ రైతు పేరు నాగుల రాములు. కాటారం మండలం గంగాపురి గ్రామం. ఎకరం రూ.20 వేల చొప్పున రెండెకరాల పొలం కౌలుకు తీసుకుని పత్తిపంట సాగు చేశారు. గ్రామంలోని పెద్దవాగు ఉప్పొంగి పొలమంతా రాళ్లు, రప్పలతో నిండిపోయింది. ఇప్పటి వరకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టానని.. రూ.40 వేలు కౌలు చెల్లించానని, వరదకు పంటంతా కొట్టుకుపోయి రూపాయి కూడా వచ్చేలా కనిపించడం లేదని వాపోయారు. కౌలు రైతులకు కనీసం రైతుబంధు కూడా రావడం లేదని, అది వచ్చినా కొంత ఊరట కలిగేదని నిట్టూర్చారు.

మూడేళ్ల నుంచి ఇదే తీరు

ఈ దంపతులు వెన్నపురెడ్డి లచ్చిరెడ్డి, సమ్మక్క. వీరిది మహాదేవపూర్ మండలం అన్నారం. రూ.50 వేలు ఖర్చుపెట్టి రెండెకరాల్లో పత్తి పంట వేశారు. ఎప్పటిలానే వరద వచ్చి పంట మొత్తం నీటిపాలైంది. పొలం మొత్తం గండ్లు పడ్డాయి. 'సరస్వతి ప్రాజెక్ట్ కడితే వరద రాదనుకున్నాం. ఇప్పుడు దాని నుంచే వరద పొలాల పైకి వస్తోంది. మూడేళ్ల నుంచి ఇదే తీరు. పంట వేసి రూపాయి తిన్న పాపాన్న పోలేదు. వేరే పనులు చేసి వ్యవసాయం మీద పెట్టి నష్టపోవాల్సి వస్తోంది.' అని వాపోతున్నారు.

రెండెకరాలు చెత్తతో నిండింది

ఈమె పేరు యెర్రోళ్ల రాజేశ్వరి. కాటారం మండలం గంగాపురి గ్రామం. మానేరు వాగు వరదలో కొట్టుకొచ్చిన చెత్తతో వీళ్ల రెండెకరాల పొలం అధ్వానంగా తయారైంది. చిన్నపాటి చెరువును తలపించేలా.. పొలం మొత్తం గుర్రపుడెక్క, చెత్త, ముళ్లతో నిండింది. పాములు దర్శనమిస్తున్నాయి. వాటిని తొలగించి పంట వేద్దామన్నా కూలీలు పనికి రావడానికి భయపడుతున్నారు. తానే తొలగింపు పనులు చేద్దామంటే ఎటు నుంచి ఏ పాము వచ్చి కరుస్తుందోనన్ని భయందోళన చెందుతున్నారు. రూ.20 వేల వరకు నష్టపోయినట్లు బాధితురాలు తెలిపారు.

# పాత పుస్తకాలతోనే పాఠాలు

వరంగల్ : జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకులంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులు. ఈసారి కొత్త పాఠ్యపుస్తకాలు ఇంకా అందలేదు. చేతుల్లో ఉన్నవి పాతవి. వీటిల్లో చాలా వరకు పేజీలు చిరిగిపోవడంతో పాఠాలు చదివేటప్పుడు అయోమయానికి గురవుతున్నారు. పుస్తకాలు అందక ఇబ్బంది పడుతున్నది వీళ్లొక్కరే కాదు.. ఉమ్మడి వరంగల్ ఆరు జిల్లాల వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉన్న కస్తూర్బా (కేజీబీవీ), ఆదర్శ, మహాత్మాజ్యోతిబా ఫులే బీసీ సంక్షేమ, మైనారిటీ, ఇతర సంక్షేమ కళాశాలల విద్యార్థులు ఉన్నారు.

ఇంటర్మీడియట్ కళాశాలలు ప్రారంభమై ఇప్పటికే రెండు నెలలు గడిచిపోయింది. వెంటనే పాఠ్యపుస్తకాలు అందిస్తే విద్యార్థులకు చదువుకునేందుకు అనువుగా ఉంటుంది. ఇప్పటికీ కొన్నిచోట్ల పుస్తకాలు అందలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇటీవలే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇచ్చారు. బీసీ సంక్షేమ కళాశాలలు, ఆదర్శ, కస్తూర్బా కళాశాలల్లో ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇవి వందకుపైనే ఉంటాయి. ఇక్కడ చేరేవారంతా నిరుపేదలే. కొందరు తప్పని పరిస్థితుల్లో ప్రయివేటు విక్రయకేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నారు.

ఇవీ కొన్ని ఉదాహరణలు పర్వతగిరి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల, ఆదర్శ, ఇంటర్ కళాశాలల్లో పుస్తకాలు రాలేదు. జిల్లాలోని చాలాచోట్ల ఇదే పరిస్థితి. ఖానాపురం మండలం బుధరావుపేట ఆదర్శలో సైతం ఇదే పరిస్థితి. గీసుకొండ కళాశాలలో మొదటి సంవత్సరం సివిక్స్, చరిత్ర, హిందీ, ఎకనామిక్స్‌వి రాలేదు. వర్ధన్నపేట పట్టణంలోని మైనారిటీ గురుకుల, ఇల్లంద గ్రామంలోని కేజీబీవీలో విద్యార్థులకు ఇంకా అందలేదు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మొత్తం 8 జూనియర్ కళాశాలలు ఉండగా.. అందులో ఆరు చోట్ల పుస్తకాలు రాలేదు. ఇందులో అయిదు ఎంజేపీ, ఒకటి కేజీబీవీ ఉంది.జయశంకర్ జిల్లాలోని 10 కేజీబీవీలు, 6 ఆదర్శపాఠశాలల్లోని ఇంటర్ విద్యార్థులకు ఇప్పటికీ అందలేదు. జిల్లాలో కేవలం అయిదు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మాత్రమే పంపిణీ చేశారు.డోర్నకల్ మండలంలో చిల్లోడులోని ఆదర్శలో అందలేదు. మహబూబాబాద్ జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అన్నింటికీ తెలుగు మాధ్యమం పుస్తకాలు ఇవ్వగా.. ఆంగ్ల మాధ్యమంలో ఉన్న నాలుగింటికి అందలేదు.

# రూ.700 కోట్లతో మున్నేరుకు కరకట్టలు



ఖమ్మం : మున్నేరు వరదల నుంచి ఖమ్మం నగరానికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టింది. ఖమ్మం నగరంలోని మున్నేరు ఉప నదికి రెండు వైపులా కరకట్టలు నిర్మించేందుకు ఇప్పటికే ప్రభుత్వం రూ.146 కోట్లు మంజూరు చేసింది. అనంతరం జిల్లాలోని నీటిపారుదల శాఖ అధికారులకు అందిన ఆదేశాల మేరకు కరకట్టల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మున్నేరుకు రెండు వైపులా 10 కి.మీ పొడవునా కరకట్ట(సిమెంట్ కాంక్రీట్ వాల్) నిర్మించేందుకు రూ.700 కోట్ల అంచనా వ్యయంతో సిద్ధం చేసిన ప్రతిపాదనలు హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల వద్దకు చేరాయి. జిల్లాకు చెందిన అధికారులు హైదరాబాద్‌లోని వివిధ స్థాయిల్లోని అధికారులను కలసి ప్రతిపాదనలు వివరించి.. వారిని ఒప్పించి ఆమోదం పొందుతున్నారు. పలు స్థాయిలు దాటిన తర్వాత ఈఎన్‌సీ(ఇంజినీర్ ఇన్ చీఫ్) ఆమోదం లభించాక కరకట్టల నిర్మాణానికి అనుమతులు లభిస్తాయి.

ప్రతిపాదనలు ఇలా...

ఖమ్మంలో మున్నేరు నదిపై రైల్వే అక్విడెక్ట్ వద్ద నుంచి రెండు వైపులా దిగువకు 10 కి.మీ. పొడవున.. 36 అడుగుల ఎత్తుతో సిమెంట్ కాంక్రీట్ గోడ నిర్మించాలని ప్రతిపాదించారు. ఇటీవల అత్యధికంగా 30.7 అడుగుల మేరకు వరద వచ్చింది. అంతకు మించి 36 అడుగుల ఎత్తులో గోడ నిర్మించాలని నిర్ణయించారు. దీంతోపాటు నదికి రెండు వైపులా ఖమ్మం నగరం, పెద్దతండా, ఏదులాపురం ప్రాంతాల నుంచి వచ్చి కలిసే మురుగు కాలువల (డ్రైయిన్లు) గోడల ఎత్తు పెంచాల్సి ఉంటుంది. మురుగు కాలువలు కరకట్ట గోడల వెలుపల ప్రాంతం నుంచి నది దిగువ వరకు నిర్మించి నదిలో కలుపుతారు. ఖమ్మం నగరంలో ఎక్కువగా మురుగు కాలువల గోడల ఎత్తు పెంచాల్సి వస్తుంది. ఇలా చేయటం వల్ల ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో చిన్నవానకే రోడ్లపైకి మురుగునీరు చేరే ప్రమాదం తప్పుతుంది.

డ్రోన్ కెమెరాలతో సర్వే

ఖమ్మంలో మున్నేరు నదిపై రైల్వే అక్విడెక్ట్ వద్ద నుంచి దిగువకు కరకట్టలు నిర్మిస్తే అక్కడికి ఎగువన ఉన్న దానవాయిగూడెంకాలనీ, రామన్నపేట సహా రెండోవైపు రైల్వే ట్రాక్ భవిష్యత్‌లో వరద ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో ఖమ్మం రూరల్ మండలం తీర్థాల సంగమేశ్వర ఆలయ ప్రదేశం నుంచి మున్నేరు నదికి రెండు వైపులా కరకట్ట నిర్మాణానికి మరో ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం రెండు రోజులుగా ఓ ప్రైవేట్ ఏజెన్సీతో డ్రోన్ కెమెరాలతో సర్వే నిర్వహించారు. తీర్థాల వద్ద నుంచి కరకట్టల నిర్మాణం చేపడితే అదనంగా మరో రూ.800 కోట్లు వ్యయం అవుతుంది. మొదటి దశలో రూ.700 కోట్ల పనులు, రెండో దశలో రూ.800 కోట్లతో కరకట్టల నిర్మాణ పనులు పూర్తయితే ఖమ్మం నగరానికి మున్నేరు ముప్పు తప్పుతుందని నీటిపారుదల శాఖ అధికారి ఒకరు తెలిపారు.

# స్థాయి పెంపుతో వైద్యసేవలు మెరుగు




కొత్తగూడెం : పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పలు ప్రభుత్వాసుపత్రుల పడకల సంఖ్య పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉభయ జిల్లాల్లోని తిరుమలాయపాలెం (ప్రస్తుత 30 పడకలు), ఇల్లెందు (50), అశ్వారావుపేట (30) దవాఖానాల స్థాయి వంద పడకలకు పెంచుతూ అధికారులకు ఆదేశాలిచ్చింది. ఒక్కో ఆసుపత్రికి రూ.37.50 కోట్ల చొప్పున మంజూరుకానున్నాయి. స్థానిక దవాఖానాల స్థాయి పెంపుతో సర్వజన ఆసుపత్రులపైనా భారం తగ్గనుంది.

త్వరలో మరికొన్ని..పాల్వంచ, చర్ల, పాలేరు, వైరా ప్రభుత్వాసుపత్రుల స్థాయి పెంపు అంశం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనకు వెళ్లింది. అనుమతులు లాంఛనమేనని ఆయా దవాఖానాల అధికారులు పేర్కొంటున్నారు. ప్రతిపాదనలు వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల వద్ద ఉన్నట్లు తెలిపారు. ఉత్తర్వులు జారీ అయితే త్వరలో ప్రజలకు 24 గంటల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

కలిగే ప్రయోజనాలివీ..ఆసుపత్రి స్థాయి పెంపుతో అధునాతన వసతులతో భవన సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ ఏర్పాటు చేస్తారు. ప్రసూతి, మత్తు వైద్యులు, సర్జన్లు, చిన్నపిల్లలు, ఇతర ప్రత్యేక నిపుణులు, సిబ్బంది సహా పోస్టులను 103కి పెంచుతారు. సదరం శిబిరాలూ స్థానికంగానే నిర్వహిస్తారు. పోస్టుమార్టం సేవలు అందుబాటులోకి వస్తాయి. ముఖ్యంగా గర్భిణులు, డయాలసిస్ బాధితులకు వ్యయప్రయాసలు తప్పుతాయి. ల్యాబ్ వసతులు, సేవలు మెరుగవుతాయి. ఉభయ జిల్లాల కేంద్రాలకు దూరప్రాంతంలో నివసించేవారికి అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యం స్థానికంగానే దక్కుతుంది.నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1, గ్రేడ్-2, ఫిజియోథెరపిస్ట్, లే సెక్రటరీ, ట్రెజరర్ గ్రేడ్-2, రిసెప్షనిస్ట్, జూనియర్ అనలిస్ట్, ఫార్మసిస్ట్, ఆఫీస్ సూపరింటెండెంట్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఒకటి చొప్పున, మిడ్‌వైఫరీ నర్సులు, ఫార్మసిస్ట్ గ్రేడ్-2, ల్యాబ్ టెక్నీషియన్, థియేటర్ అసిస్టెంట్ పోస్టులు రెండుచొప్పున భర్తీ చేస్తారు.ఆసుపత్రుల అప్‌గ్రేడ్‌తో మారుమూల ప్రజలకు అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయి. అత్యవసర వైద్యం అవసరమైతే కొత్తగూడెం, ఖమ్మం జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. వంద పడకల ఆసుపత్రుల ఏర్పాటుతో స్థానికంగానే ప్రత్యేక వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారు.రవిబాబు, డీసీహెచ్ఎస్, భద్రాద్రి

# బస్తీ దవాఖానాలకు సుస్తీ

జయశంకర్ : పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన బస్తీ దవాఖానాలకే సుస్తీ చేసింది. రోగులకు అనుకున్న మేర సేవలందించలేకపోతున్నాయి. శనివారం మినహా.. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ దవాఖానాలు పనిచేస్తాయి. ఒక వైద్యుడు, ఒక స్టాఫ్‌నర్సుతో పాటు అటెండర్ ఉంటారు. వరంగల్ నగరంలోని క్రిస్టియన్‌కాలనీ, శంభునిపేట గిరిప్రసాద్‌నగర్, ఉర్సుగుట్ట బీఆర్‌నగర్‌లో మూడు చోట్ల బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారు. వాటిలో వైద్యులు, స్టాఫ్ నర్సులను నియమించారు. అయితే అందులో రెండు మాత్రమే ప్రారంభానికి నోచుకున్నాయి. ముంపు ప్రాంతమైన బీఆర్‌నగర్‌లోని రాజీవ్ గృహకల్ప అపార్టుమెంటు కింది అంతస్తులో రంగులు వేసి, బోర్డు రాయించి ముస్తాబు చేసిన దవాఖానా మాత్రం ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ ఏడాది జూన్ 14న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా క్రిస్టియన్‌కాలనీ, శంభునిపేట గిరిప్రసాద్‌నగర్‌లోని బస్తీ దవాఖానాలను ప్రారంభించిన అధికారులు.. చివరి నిమిషంలో ఉర్సుగుట్ట బీఆర్‌నగర్‌లోని దవాఖానా ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. అప్పటి నుంచి అధికారులు దానిగురించి పట్టించుకోలేదు.ముంపువాసులకు అందని వైద్యం..: గతనెల చివరి వారంలో కురిసిన ఏకధాటి వర్షాలకు బీఆర్‌నగర్, ఎన్ఎన్‌నగర్, రాజీవ్‌నగర్, రాజీవ్ గృహకల్ప, సాయినగర్, గాయత్రినగర్ కాలనీలు



నీటమునిగిన విషయం తెలిసిందే. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న స్థానికులు కలుషిత నీటిలో రోజుల తరబడి ఉండటం వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా జ్వరాలు, జలుబు, కళ్ల కలక, కాళ్లు చేతులకు పగుళ్లు, చర్మవ్యాధులు, వాంతులు, విరేచనాలు తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ఉర్సుగుట్ట బీఆర్‌నగర్‌లోని బస్తీ దవాఖానా ప్రారంభానికి నోచుకోకపోవడంతో అక్కడి ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. కనీసం వైద్య శిబిరాలు కూడా నిర్వహించకపోవడం గమనార్హం.ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం..: డా.వెంకట రమణ, డీఎంహెచ్‌వో

బీఆర్‌నగర్ బస్తీ దవాఖానా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశాం. ఆ ఇల్లు తనదంటూ స్థానికుడు ఒకరు కోర్టుకు వెళ్లడంతో వాయిదా వేశాం. మరోచోట ఏర్పాటు చేయడానికి కలెక్టర్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇంకా పరిశీలనలో ఉంది. మిగిలిన రెండు బస్తీ దవాఖానాల్లో మందులు అన్నీ అందుబాటులో ఉన్నాయి. వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటా.

# జల సవ్వడులు.. సాగు పరుగులు!

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో జలసవ్వడులు వినిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తుండగా, భూగర్భజల మట్టాలు కూడా వృద్ధి చెందాయి. కేవలం నెల రోజుల వ్యవధిలోనే జిల్లా సగటు భూగర్భజల మట్టాలు 4.65 మీటర్ల మేర పెరిగాయి. నీటి లభ్యతతో సాగు పరుగులు తీస్తోంది. పత్తి సాగు పూర్తవగా వరి దాదాపు 80 శాతానికి చేరుకుంది. మరో పది రోజుల్లో వరి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే గత వానాకాలం సీజన్‌తో పోల్చితే ఈ ఏడాది పత్తి సాగు కొంతమేర తగ్గింది.

మెట్ట ప్రాంతమైన జిల్లాలో అత్యధిక శాతం బోర్లు, బావులపైనే వ్యవసాయం ఆధారపడి ఉంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో అన్ని రకాల పంటలు కలుపుకొని 2,40,061 ఎకరాల్లో సాగుకానున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో ప్రధాన పంటలైన వరి 1,62,036, పత్తి 74,492, కంది 1,756, మొక్కజొన్న 1,347, ఇతర పంటలు 330 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. తొలుత సరైన వర్షాలు లేక పంటలు వేసే ప్రక్రియ నెమ్మదించింది. ఆ తర్వాత కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడం, భూగర్భజల మట్టాలు పెరగడంతో సాగులో వేగం పుంజుకుంది. ఆగస్టు 8 వరకు 1,38,850 ఎకరాల్లో వరి పంట వేశారు. బోర్లు, బావుల కింద వరి సాగు ముందుగానే పూర్తవగా ప్రస్తుతం ఆయకట్టు ప్రాంతాల్లో కొనసాగుతోంది. మరో పది రోజుల్లోగా నాట్లు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. పత్తి 52,250, కంది 765, మొక్కజొన్న 456, ఇతర పంటలు 56 ఎకరాల్లో సాగయ్యాయి. గతేడాది వానాకాలంతో పోల్చితే ఈ సంవత్సరం సుమారు 5 నుంచి 10



శాతం పత్తిసాగు విస్తీర్ణం తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా వరి పంటలో మొగిపురుగు, కాండం కుళ్లు తెగుళ్లు ఆశిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల నివారణకు పురుగు మందుల వాడకంతో రైతులపై ఆర్థికభారం పడుతోంది.

57 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం

జిల్లాలో ఈ నెల 10 నాటికి 426.9 మిల్లీమీటర్ల సాధారణ సగటు వర్షపాతానికి గాను 668.3 మిల్లీమీటర్లు కురవడంతో జిల్లా సగటు వర్షపాతం 57.0 మిల్లీమీటర్లు అధికంగా నమోదైంది. చందుర్తి, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. సమృద్ధిగా కురిసిన వర్షాలతో భూగర్భజల మట్టాలు భారీగా పెరిగాయి. జూన్ నుంచి జులై వరకు నెల రోజుల వ్యవధిలోనే సగటున 4.65 మీటర్ల మేర వృద్ధి చెందాయి. బోయినపల్లి మండలంలో అత్యల్ప లోతు 5.54 మీటర్లలో భూగర్భ జలాలు లభిస్తుండగా, వేములవాడ అర్బన్ ప్రాంతంలో అత్యధిక లోతు 17.44 మీటర్లలో లభ్యమవుతున్నాయి. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో వ్యవసాయానికి ఎలాంటి సాగునీటి కొరత ఉండదని కర్షకులు భావిస్తున్నారు.

సిద్ధంగా ఉన్న నారుతో వరి నాట్లు వేయాలి – భూమిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

సీజన్ పూర్తవుతున్న తరుణంలో ఇప్పుడు నార్లు పోసేందుకు ఆస్కారం లేదు. సిద్ధంగా ఉన్న నార్లతో నాట్లు వేసుకోవాలి. ఈ సమయంలో వెదజల్లడం, డ్రమ్‌సీడర్‌తో విత్తుకోవడం మేలు. మొక్కజొన్న పంటను సాగుచేసుకోవచ్చు. వరిలో కాండం కుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు గానీ, ప్రొపికొనజోల్ ఒక మిల్లీ లీటరు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొగిపురుగు నివారణకు నాట్లు వేసిన 25 రోజుల్లోగా కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ గుళికలను ఎకరానికి 8 కిలోల చొప్పున చల్లాలి.

# దిగువ ప్రాంతాలపై సమగ్ర అధ్యయనమేదీ!

ధర్మపురి: ధర్మపురికి చేరే గోదావరి వరద నీటిపై శాస్త్రీయ దృక్పథం కరవైంది. భౌగోళికంగా ధర్మపురి తీరంలో గడచిన పదేళ్లలో పలు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. దీనిని అనుగుణంగా నీటిపారుదల శాఖ అధికారులు సర్వేలు చేసి పక్కా అంచనాలు వేయాల్సి ఉండగా అలా చేయడం లేదు. ఎల్లంపల్లి నిల్వ నీరు రాని సమయంలో ఎగువ ప్రాంతం నుంచి భారీ ఎత్తున వరద వచ్చినా సాఫీగా దిగువకు వెళ్లేది. దీంతో జిల్లా సరిహద్దున గల పురాతన రాయపట్నం వంతెన నీటి మునిగిపోగా రోజుల తరబడి నదీ ప్రవాహం కొనసాగేది. వరద నీటితో ధర్మపురికి అంతగా ముంపు ఆపద సంభవించేది కాదు. ధర్మపురికి ఎదురుగా ఉన్న బండరాళ్లు మునిగితేనే వరద గురించి స్థానికులు ఆలోచించే వారు. 1995, 2022లో మాత్రం నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు నుంచి భారీ వరద వచ్చిన సందర్భంలో ధర్మపురి పట్టణంలోకి వరదనీరు చేరింది. ప్రస్తుతం ఓ వైపు నిండుకుండలా ధర్మపురి వద్ద ఎల్లంపల్లి జలాశయం నీరు ఉండటం, మరోవైపు ఎగువన భారీ వర్షాలతో కడెం జలాశయం నుంచి నీటిని వదిలినప్పుడల్లా వరద నీరు వేగంగా ధర్మపురిలోకి చేరుతోంది. కడెం జలాశయం నుంచి నీటిని వదిలితే ధర్మపురి ప్రాంతానికి ఎంత వరద వస్తుందనే విషయంపై నీటి పారుదల శాఖ అధికారులు కనీస అధ్యయనం చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్లంపల్లి జలాశయం విషయంలోనూ ఇంతే అని స్థానికులు అంటున్నారు. ఫలితంగా భారీ వర్షాలు కురిసిన సమయంలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తుందని చెబుతున్నారు.వరద అంచనాలు రూపొందించి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉండగా దానిని చేపట్టడం లేదు. నదీతీరం వెంట వరద తగ్గే వరకు వేచి చూడాల్సి వస్తోందని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి తీర ప్రాంతంలో ఇబ్బందులపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

# భోజనంలో పురుగులు.. సిబ్బంది ఆందోళన

భీమారం : హనుమకొండ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని నాలుగు చోట్ల కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొన్న వైద్యసిబ్బందికి పురుగుల భోజనం అందించడంపై ఆందోళన వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి వైద్య బృందంలో ఒక వైద్యాధికారి, ఒక ఆప్తాలమిస్టు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ముగ్గురు ఏఎన్ఎంలు, ముగ్గురు ఆశలు, ముగ్గురు ఆర్పీలు మొత్తం 10 నుంచి 12 మంది వరకు ఉంటారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగే శిబిరాల్లో పాల్గొనే వీరికి తేనీరు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం తేనీరు, స్నాక్స్ ఇవ్వడానికి ప్రభుత్వం ప్రతి బృందానికి రోజుకు రూ.1500 ఖర్చు చేయాలని నిధులు విడుదల చేసింది. ఈ బాధ్యత తీసుకున్న వరంగల్ మహా నగరపాలక సంస్థ హనుమకొండలోని 21 కంటివెలుగు బృందాలకు ఆహారం పంపిణీ చేస్తోంది. ఈ క్రమంలో మంగళవారం హనుమకొండ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని భీమారం, లష్కర్‌సింగారం, పోచమ్మకుంట, న్యూశాయంపేట బృందాల్లోని సభ్యులు మధ్యాహ్న భోజనం చేస్తుండగా అందులో బొద్దింకలు, లక్క పురుగులు కనిపించాయి. దీంతో వారు భోజనం తినకుండా పడేశారు. ఆకలివేసే సమయంలో తినే ఆహారంలో పురుగులు రావడంతో వైద్యసిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం తాగునీరు సదుపాయం కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం



చేశారు. వైద్యాధికారుల ద్వారానే భోజనం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, మంచి పోషకాహారం అందించాలని సిబ్బంది కోరుతున్నారు. ఈవిషయంపై హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావును వివరణ కోరగా నగర పరిధిలో ఆహార పంపిణీ బాధ్యతను కార్పొరేషన్ అధికారులు చూస్తున్నారని, ఈవిషయంపై వారితో చర్చిస్తామని చెప్పారు. మరోవైపు వరంగల్ జిల్లాలోని చింతల్, ఖిలావరంగల్ తదితర ప్రాంతాల్లో నాలుగు రోజులుగా ఎలాంటి ఆహారం ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నామని సిబ్బంది తెలిపారు. ఈ విషయంపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ కంటివెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోపాలరావును వివరణ కోరగా తనకు కూడా ఫిర్యాదులు వచ్చాయని, ప్రత్యేక అధికారుల ద్వారా విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# ఉల్లం‘ఘనులు’

భూపాలపల్లి : జిల్లాలో వాహనదారులు రహదారి నిబంధనలు పాటించడం లేదు. ఇష్టారీతిగా డ్రైవింగ్ చేస్తూ ఇతరులను ఇబ్బందులకు గురిచేయడమే కాదు.. ప్రమాదంలో పడేస్తున్నారు. ఇలాంటి వారిని పోలీసులు ఉపేక్షించడం లేదు. మోటారు వాహనాల చట్టం కింద కేసులు నమోదు చేస్తూ జరిమానాలు విధిస్తున్నారు. గత ఏడాది కాలంలో జిల్లాలోని 12 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 34,589 ఎంవీ కేసులు నమోదయ్యాయి. ఈ ఒక్క జనవరిలోనే 22వ తేదీ వరకు దాదాపు 172 కేసులు నమోదు కావడం జిల్లాలో సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.

మూడో వంతు ఇవే! వాహనచోదకులు ఏమాత్రం రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించినా కేసులు నమోదు చేసి జరిమానాలను విధిస్తున్నారు. ఎంవీ చట్టం ప్రకారం 174 రకాల రోడ్డు నిబంధనల ఉల్లంఘనలు ఉంటాయి. ఇద్దరికి మించి ద్విచక్రవాహనాలపై ప్రయాణించడం, చరవాణి మాట్లాడుతూ వాహనం నడపడం, నంబర్ ప్లేట్, దానిపై నంబరు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా లేకపోవడం



వంటి ఉల్లంఘనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. మొత్తం ఎంవీ కేసుల్లో మూడో వంతు రహదారి ఉల్లంఘన కేసులు కావటం గమన్వారం.

విధించే జరిమానాలివే.. కొన్న నెలలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే రూ.2వేలు జరిమానా విధిస్తారు. టూవీలర్‌పై ఇద్దరికి మించి ప్రయాణిస్తే రూ.1235 లి చరవాణి మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ.1,035 లి నంబర్ ప్లేట్‌పై సంఖ్య లేకపోతే రూ.1,000 వాహన బీమా లేకపోతే రూ.1,000 వాహనం పిట్‌నెస్ లేకపోతే రూ.1,000 లి అత్యంత వేగంగా ప్రయాణిస్తే రూ.1,000 లి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.500 లి రాంగ్ పార్కింగ్ చేస్తే రూ.235 నంబర్ ప్లేట్ లేకపోతే రూ.235 శిరస్త్రాణం లేకపోతే రూ.135 కారులో సీట్‌బెల్ట్ ధరించకపోతే రూ.100 కారులో పరిమితికి మించితే ఒక్కొక్కరికి రూ.100 చొప్పున జరిమానాలు విధిస్తున్నారు.

ఉపేక్షించేది లేదు..

–రాజిరెడ్డి, సీఐ, భూపాలపల్లినిబంధనలను ఉల్లంఘించే వారిని ఉపేక్షించేది లేదు. జరిమానాలతో పాటు కేసులు ఉంటాయి. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలి. రోడ్డు నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి. రహదారిపై ఉన్న చిహ్నాలను చూసి వాహనాన్ని నడుపుతుండాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

# కాకతీయ వైభవం ఉట్టిపడేలా శివాలయం పునఃప్రతిష్ఠ



వర్ధన్నపేట : శిథిలావస్థలో ఉన్నటువంటి ఏడు శతాబ్దాల కిందట కాకతీయులు నిర్మించిన పర్వతాల శివాలయాన్ని స్థానిక గుట్టపైకి తీసుకెళ్లారు. కాకతీయుల శిల్పకళ ఉట్టిపడేలా పునర్నిర్మాణం చేశారు. విగ్రహ, యంత్ర ప్రతిష్ఠ మహాకుంభాభిషేక కార్యక్రమాలను ఈ నెల 26నుంచి మూడు రోజులపాటు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. 26న సుప్రభాతసేవతో కార్యక్రమాలు మొదలై వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు జరుగుతాయి. 27న మహాలింగార్చన, రుద్రాభిషేకం, దేవతామూర్తులకు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. 28న విగ్రహప్రతిష్ఠ, నందీశ్వర, శిఖర, ధ్వజ ప్రతిష్ఠలు ఉంటాయి.

ఇదీ దేవాలయ చరిత్ర..

కాకతీయుల పాలన శివాలయాల కేంద్రంగా సాగేది. ఈ క్రమంలో రాణిరుద్రమదేవి మనుమడు ప్రతాపరుద్రుడి పేరుతో సుమారుగా 700 సంవత్సరాల క్రితం ప్రస్తుత పర్వతగిరి గ్రామంలోని పర్వతాల గుట్ట కింద ప్రతాప రుద్రగిరి గ్రామాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు తాగు, సాగు నీటి సౌకర్యార్థం చెరువు, కుంటలను నిర్మించడంతో పాటు శివాలయం నిర్మించారు. కొన్నేళ్లకు ఆలనాపాలన లేకపోవడంతో శివాలయం శిథిలావస్థకు చేరి ధ్వంసమైంది. కాలక్రమేణా ప్రతాపరుద్రగిరి గ్రామం ప్రతాపగిరిగా... ఇప్పుడు పర్వతగిరిగా మారింది. కాకతీయుల నాటి ఆనవాళ్లు నేటికీ కనిపించటం వారి పాలనకు నిదర్శనం. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో ఆర్డీఎఫ్ వ్యవస్థాపక సభ్యులు ఎర్రబెల్లి రామోహన్‌రావు చరిత్ర కలిగిన ఈ శివాలయం పునర్నిర్మాణానికి నడుం బిగించారు. గుట్టపై పూర్వ వైభవం కనిపించేలా రాళ్లతో శివాలయం నిర్మాణం చేపట్టారు.

పూర్వ వైభవానికి శాశ్వత పనులు

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు పర్యవేక్షణలో దేవాదాయ శాఖ నుంచి రూ.70లక్షలు నిధులు మంజూరు కాగా దాతల నుంచి సుమారుగా రూ.7కోట్లు సేకరించి పునర్నిర్మాణం చేపట్టారు. పూర్వ వైభవం తెచ్చేలా శాశ్వత పనులు చేపట్టారు. గుట్టపైకి వెళ్లడానిక్తి గుట్టను తొలచి సుమారుగా 380మీటర్ల ఎత్తులో 700 మెట్లు, రెయిలింగ్ పనులు చేశారు. మరో వైపు వాహనాల కోసం సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. గుట్టపై పురోహితుడు, వాచ్‌మెన్ ఉండటానికి గదులు, విద్యుత్తు సౌకర్యం, పార్కింగ్,. తాగునీరు అందుబాటులో ఉంచారు. గుట్ట చుట్టూ పచ్చటి ప్రకృతి ఆహ్లాదకరంగా కనువిందు చేయనుంది.

రిజర్వాయర్‌లో బోటింగ్

పర్వతగిరిలో మూడు రోజుల పాటు నిర్వహించే పర్వతాల శివాలయం ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా రిజర్వాయర్‌లో బోటింగ్ ఏర్పాటు చేశారు. దర్శనార్థం వచ్చే భక్తులు ఆహ్లాదకరంగా ఉండేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. పెద్ద చెరువు రిజర్వాయర్ పునర్నిర్మాణ పనులు పూర్తి చేసి కెనాల్ కాలువ ద్వారా నీటిని నింపి బోటింగ్‌కు అనుకూలంగా మార్చారు.

# తులారం... నెరవేరని లక్ష్యం..!



మహబూబాబాద్ : ముంపు ఆందోళన లేదు..నిర్వాసితుల మాటే వినిపించదు.. కరకట్ట నిర్మించాల్సిన అవసరం కూడా లేదు.. ప్రభుత్వం కాస్త దృష్టిసారిస్తే ఆ ప్రాజెక్ట్ లక్ష్యం నెరవేరి వేల ఎకరాలకు సమృద్ధిగా సాగు నీరు అందుతుంది. ప్రాజెక్ట్ ఎత్తును మరికొంత పెంచి ప్రధాన కాల్వలను అభివృద్ధి చేస్తే బీడుభూములు సస్యశ్యామలమవుతాయి. ఒక టీఎంసీ నీరు నిలిచేలా చేయగలిగితే సుమారు 12 వేల ఎకరాలకు సాగునీటికి ఆందోళన ఉండదు. ఇంత ప్రాధాన్యమున్న తులారం ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తే మహబూబాబాద్ జిల్లాకే తలమానికంగా నిలువనుంది. బయ్యారం మండలం వినోభానగర్ సమీపంలో వట్టివాగుపై బీఎన్ గుప్తా (తులారం ప్రాజెక్ట్)ను నిర్మించారు. ప్రాజెక్ట్ నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం, నీటిపారుదలశాఖ అధికారుల పట్టింపులేక నిష్ప్రయోజనంగా మారుతుంది. 2003లో ప్రభుత్వం రూ.11.5కోట్ల వ్యయంతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి 2005లో పూర్తి చేశారు. చుట్టూరా కొండల మధ్య నీటిని ఒడిసిపట్టేలా ఉన్న ప్రాంతంలో రెండు ఎత్తైనగుట్టలను ఆధారం చేసుకొని సుమారు 21 అడుగుల ఎత్తులో 0.50 టీఎంసీ నీళ్లు నిలిచేలా ప్రాజెక్ట్ నిర్మించారు. ఏటా ప్రాజెక్ట్‌లో సమృద్ధిగా నీరుచేరుతున్నా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో అందించే పరిస్థితి కనిపించడంలేదు.

తగ్గిన నీటి సామర్థ్యం.. ప్రధాన కాల్వలు అధ్వానం

సమృద్ధిగా నీటి వనరులున్న ఈ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయి సాగునీరు వృథా అవుతోంది. ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో అంచనాల తగినట్టుగా నీరు నిలువడంలేదు. రెండువేల ఎకరాలకు సాగునీరిచ్చే లక్ష్యంగా నిర్మించిన ఈ ప్రాజెక్ట్ కనీసం 500 ఎకరాలకు కూడా అందించలేని దయనీయ పరిస్థితి కనిపిస్తుంది. ప్రాజెక్ట్ ప్రధాన కాల్వలు కనీస మరమ్మతులు నోచుకోక ఆనవాళ్లు కోల్పోయాయి. కాల్వకు నిర్మించిన చప్టాలు, కల్వర్టులు కూలిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో కాల్వ పూడిపోవడంతో ఆక్రమణలు జరిగి నామరూపాలులేకుండా పోయింది.

ఎత్తు పెంచితే..

కేవలం 21 అడుగుల ఎత్తుతో 0.50టీఎంసీ నీటిని మాత్రమే నిలువచేసే సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్ట్ ఎత్తు మరో 15 అడుగులకు పెంచి ఒక టీఎంసీ నీటిని నిలువ చేసేందుకు వీలుంది. సుమారు 20, 30 కి.మీ., దూరం నుంచి గుట్టలు, వాగుల ద్వారా నీళ్లు చేరుతుంటాయి. ప్రభుత్వం, నీటిపారుదలశాఖ అధికారులు ప్రాజెక్ట్ అభివృద్ధిపై దృష్టి సారిస్తే సాగునీటి కొరత తీరుతుంది. ప్రాజెక్ట్ ఎత్తుపెంచి ప్రస్తుతమున్న ఎడమ కాల్వతోపాటు కుడికాల్వను నిర్మిస్తే జిల్లాలోని అనేక గ్రామాలకు ప్రయోజనం చేకూరనుంది. 2వేల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా నిర్మించిన ఈ ప్రాజెక్ట్ ఆయకట్టు 12 వేల ఎకరాలకు పెంచవచ్చు. జిల్లాలో ఈ ప్రాజెక్ట్‌ను పర్యాటక ప్రాంతంగా కూడా అభివృద్ధిచేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రస్తుత పరిస్థితి ఇది


2 వేల ఎకరాల ఆయకట్టు సాగు లక్ష్యంగా 7కుంటలు, చెరువులు నింపేలా ప్రాజెక్ట్‌ను డిజైన్‌చేసి నిర్మించారు. సుమారు 12 కి.మీ., దూరంలో ప్రధాన కాల్వకు భూములను సేకరించి కాల్వ నిర్మించారు. కాల్వను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో సాగునీరు వృథా అవుతుంది. దీంతో కేవలం ప్రాజెక్ట్ సమీపంలోని 500 ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. ప్రధాన కాల్వ కొన్ని ప్రాంతాల్లో ఆనవాళు కోల్పోయింది.

సర్వే చేశాం –నీటిపారుదలశాఖ ఏఈ శ్రీకాంత్

తులారం ప్రాజెక్ట్ ఎత్తు పెంచే ప్రతిపాదనల మేరకు సర్వే నిర్వహించాం. అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉంది. వచ్చాక ప్రాజెక్ట్ ఎత్తుపై అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తాం.

# ఓటు వరంలో.. యువ తరంగం

నల్గొండ : యువత ఓట్లే నవభారత్‌కు పునాదిగా నిలుస్తాయి. ప్రజాస్వామ్యంలో ఓటు శక్తి అపారం. కోట్లాది మంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేందుకు ఇది అత్యంత శక్తివంతమైన సాధనం. అక్టోబరు 2023 వరకు 18 ఏళ్లు నిండే వారు ప్రస్తుతం ఓటరుగా నమోదుకు అర్హత సాధిస్తారు. వారందరినీ భారత ప్రజాస్వామ్యం స్వాగతిస్తోంది. ప్రజల చేతిలో వజ్రాయుధం ఓటు. ఎవరినైనా గద్దె ఎక్కించాలన్నా.. దించాలన్నా.. ఓటుతోనే సాధ్యం. యువతను ఓటర్లను చేర్పించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఓటుపై యువతకు అవగాహన కల్పించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఎలక్ట్రోల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేసి పాఠశాల, కళాశాల, పోలింగ్ కేంద్రం వారీగా ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగం, ప్రాధాన్యం గురించి విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పిస్తున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు భవిష్యత్తులో ఓటు నమోదు, దాని వినియోగం, ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పిస్తున్నారు. డిగ్రీ ఆపైన ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు కొత్త ఓటరు నమోదు, ఓటు ప్రాధాన్యం, ఓటు హక్కు వినియోగం గురించి వివరిస్తున్నారు. చదువు మానేసి ఇంటివద్ద ఉంటున్న వారికి పోలింగ్ కేంద్రం వారీగా ఓటుపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్ 1, జులై 1, అక్టోబరు 1వ తేదీ వరకు 18



ఏళ్లు నిండేవారు కొత్తగా ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

23 వేలకు పెరిగిన కొత్త ఓటర్లు

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 23 వేల మంది కొత్తగా ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. గత ఏడాది నవంబరు నుంచి డిసెంబరు వరకు నిర్వహించిన ప్రత్యేక సవరణ కార్యక్రమంలో సుమారు 14 వేల మంది కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో కొత్త ఓటర్ల సంఖ్య పెరిగింది. అధికంగా మునుగోడు నియోజకవర్గంలో 5485 మంది యువత కొత్తగా ఓటరుగా నమోదు అయ్యారు. తక్కువగా దేవరకొండ నియోజకవర్గంలో 1757 మంది నమోదు చేసుకున్నారు.

# వరి పైరుపై తెగుళ్ల పంజా!

ఎల్లారెడ్డిపేట : అన్నదాతలను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. పంట వేసింది మొదలుకొని చేతికందే వరకు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటున్నారు. యాసంగిలో పంటల సాగుకు శ్రీకారం చుట్టిన ప్రారంభంలోనే చుక్కెదురవుతోంది. జిల్లాలో వరి వేసిన తొలి 15 రోజుల్లోనే పంటకు ఆకుముడుచు పురుగు(లీఫ్ రోలర్) విస్తరిస్తుండగా, మొగి పురుగు ఉద్ధృతమవుతోంది. రెండు రకాల తెగుళ్లు పంజా విసురుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పురుగు మందుల పిచికారీకి అధిక వ్యయం చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

మెట్ట ప్రాంతమైన జిల్లాలో అత్యధికంగా బోర్లు, బావులపై ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం ఆంక్షలను ఎత్తివేయడంతో యాసంగి సీజన్‌లో మొత్తం 1,73,600 ఎకరాల్లో వరిసాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. భూగర్భజలాల వృద్ధి చెందడంతోపాటు నీటి వనరులు జలకళ సంతరించుకోవడంతో సాగు నీరు సమృద్ధిగా లభిస్తోంది. దీంతో రైతులు ఎప్పటిలాగే ఈసారి కూడా వరి సాగుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అత్యధికంగా ఇల్లంతకుంట మండలంలో 24 వేల ఎకరాల విస్తీర్ణంతో జిల్లాలో మొదటి స్థానంలో నిలువనుండగా, అత్యల్పంగా రుద్రంగి మండలంలో 3,400 ఎకరాల్లో వరి వేయనున్నారు. 19 వేల ఎకరాల విస్తీర్ణంతో తంగళ్లపల్లి, రెండో స్థానంలో ముస్తాబాద్ మండలం ఉండనున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 1.5 లక్షల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి.

ముప్పేట దాడి

వరి పంటలో సల్ఫైడ్ ఇంజూరీతోపాటు మొగి పురుగు, ఆకుముడుచు పురుగులు వ్యాప్తి చెందుతున్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల తెగుళ్లు సోకుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మొగిపురుగు ఉద్ధృతితో పైరులో మువ్వ ఎండిపోయి బియ్యం గింజ పరిమాణంలో లార్వా వ్యాపిస్తోంది. దీనివల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోయే ముప్పు ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకుముడుచు పురుగు ఆకులను తినేస్తోంది. రెండు, మూడు ఆకుల్ని దగ్గరగా చుట్టి లోపలిభాగాన్ని మింగేస్తోంది. మొగిపురుగు, ఆకుముడుచు పురుగు వంటి తెగుళ్ల నివారణకు రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. సస్యరక్షణ చర్యలతో పెట్టుబడి ఖర్చులు మరింత పెరుగుతుండగా, పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని వాపోతున్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

భూమిరెడ్డి, వ్యవసాయశాఖ అధికారి, ఎల్లారెడ్డిపేట

వరి పైరులో సస్యరక్షణ చర్యలు పాటించడంలో వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి. మొగి పురుగు నివారణకు ఎకరా విస్తీర్ణం పొలానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు గానీ, 8 కిలోల కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు గానీ, 4 కిలోల క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు గానీ చల్లాలి. లార్వా దశలో వరిపైరును నష్టపరుస్తున్న ప్రాంతాల్లో 2 మిల్లీలీటర్ల ప్రొఫెనోఫాస్ గానీ, 2 మిల్లీలీటర్ల క్వినాల్‌ఫాస్ గానీ, 2 గ్రాముల కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్‌పీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకుముడుచు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మిల్లీలీటర్లు గానీ, రెండు గ్రాముల కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ ఎస్.పి. పొడిని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కమతాలను ఆరబెడుతూ నీటిని అందించడం వల్ల సల్ఫర్‌డయాక్సైడ్ గాలిలో చేరిపోయి సల్ఫైడ్ ఇంజూరీ తగ్గిపోతుంది.

# ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్ను

గోదావరిఖని : ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులకు సైతం వాటి హద్దులు ఎక్కడి వరకు ఉన్నాయన్నది తెలియడం లేదు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న ఆక్రమణదారులు అందులో పాగా వేసి రియల్ దందాకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రెవెన్యూ లొసుగులను కొందరు తమకు అనుకూలంగా మలచుకొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సెంటుభూమి సైతం దొరకని పరిస్థితి.

రహదారినీ వదిలిపెట్టని అక్రమార్కులు

రహదారి విస్తరణ కోసం సింగరేణి సేకరించిన భూమిని సైతం అక్రమార్కులు కబ్జా చేశారు. మేడిపల్లి ఓసీపీ ఏర్పాటు సమయంలో రామగుండం వెళ్లేందుకు రహదారి నిర్మాణం కోసం సింగరేణి సంస్థ 13.12 ఎకరాల భూమిని సేకరించింది. మేడిపల్లి నుంచి రామగుండం వరకు 100 అడుగుల రహదారి నిర్మాణం కోసం తీసుకుంది. దానిని సైతం కబ్జా చేయడంతో ప్రస్తుతం ఆ రహదారి 60 అడుగులకే పరిమితమైంది.

ప్రజోపయోగానికి కరవు

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములు ప్రజోపయోగానికి గుర్తించలేకపోతున్నారు. అందుబాటులో ఉన్నా వాటిని గుర్తించకపోవడంతో ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోలేని దుస్థితి నెలకొంటోంది. నాలుగేళ్ల క్రితం మంజూరైన ఈఎస్ఐ ఆస్పత్రికి స్థలం చూపించకపోవడంతో నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరైనా కేవలం స్థలం లేకపోవడంతో నిర్మాణానికి నోచుకోవడం లేదు.

రియల్ దందాలో ఇందిరమ్మ స్థలాలు

ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో సేకరించిన భూమిలో కొంత మంది ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగిస్తున్నారు. ఎన్టీపీసీ జ్యోతినగర్ అన్నపూర్ణకాలనీ సమీపంలోని న్యూపీకేరామయ్య కాలనీ వద్ద నిరుపేదల ఇళ్ల కోసం ప్రభుత్వం 100 ఎకరాలు సేకరించింది. అందులో 85 ఎకరాలను ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదలకు పంపిణీ చేసింది. ఇంకా 15 ఎకరాల స్థలం ఖాళీగా ఉంది. దీనిని కబ్జాచేసి రియల్ దందా సాగించేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారు. 2008లో సేకరించిన 100 ఎకరాల భూమికి పరిహారం సైతం చెల్లించింది. ఒక సర్వే నెంబరులో 7.36 ఎకరాల భూమి రికార్డులో తప్పుగా నమోదైంది. ఒక సర్వే నెంబరుకు బదులు మరో సర్వే నెంబరులో చూపిస్తుండటంతో దీనిని ఆసరాగా చేసుకున్న కొంత మంది ఖాళీగా ఉన్న భూమిలో రియల్‌దందా మొదలు పెట్టారు. దీనిని 2009లోనే గుర్తించి సవరించాలని ఉన్నతాధికారులకు లేఖలు రాసినా ఇప్పటి వరకూ ఎలాంటి మార్పు చేయలేదు.

హద్దులు లేకపోవడంతో..

ఎన్టీపీసీ సమీపంలోని జంగాలపల్లి శివారులో ఇందిరా ఆవాస్ యోజన పథకానికి 2008లోనే ప్రభుత్వం 24.27 ఎకరాల భూమిని సేకరించింది. మరో 6 ఎకరాల ప్రభుత్వ భూమిని కలుపుకుని 30.27 ఎకరాల భూమిని ఇందిరా ఆవాస్ యోజన పథకానికి కేటాయించింది. ఒక్కో ఎకరానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించింది. ఈ భూమిని పేదలకు కేటాయించకపోవడంతో ఖాళీగా ఉంది. ఇటీవలె అందులోంచి 10 ఎకరాల భూమిని ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి కేటాయించింది. ప్రస్తుతం మరో 20ఎకరాలు ఖాళీగా ఉంది. దీనికి ఎలాంటి హద్దులు లేకపోవడంతో ఆక్రమించుకోవడానికి ప్రయత్నించే అవకాశాలున్నాయి.

మా దృష్టికి వస్తే చర్యలులక్ష్మీనారాయణ, జిల్లా అదనపు పాలనాధికారి ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్న విషయం మాదృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేస్తాం. ఇందిరమ్మ స్థలాల్లో ఆక్రమణకు పాల్పడే వారిపై విచారణ చేస్తాం.

# ఏపీఎన్‌జీవోస్ రాష్ట్ర మహాసభలకు సీఎం వైయస్ జగన్‌కు ఆహ్వానం



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ (ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్య మంత్రిని కలిసి ఈనెల 21, 22వ తేదీల్లో జరగనున్న ఏపీఎన్‌జీవోస్ 21వ రాష్ట్ర మహాసభలకు ఆహ్వానించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 21, 22 తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి.

సీఎం వైయస్ జగన్‌ను కలిసిన వారిలో ఏపీఎన్‌జీవోస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస రావు, జనరల్ సెక్రటరీ కె.వి.శివారెడ్డి, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్. చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.




# రాష్ట్ర ప్రజలకు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

అమరావతి: రాష్ట్రంలో ఎండ తీవ్రతతో పగటి పూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదు అవుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీనికి ఉక్కపోత కూడ తోడవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. వాతావరణంలోని మార్పుల వల్ల ఈ పరిస్థితి నెలకొందని స్పష్టం చేసింది. ఈ అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మామూలుగా అయితే మే నెల నుంచి ఆగష్టు వరకు ఆంధ్రప్రదేశ్ వాతావరణంపై సోలార్ రేడియేషన్ ప్రసరణ ఎక్కువగా ఉంటుందని తెలిపింది. అయితే భూమి ఉపరితలం పైకి వచ్చే సూర్యకిరణాల ప్రసరణ వర్షాకాలంలో ఉండే మేఘాల కారణంగా వేసవితో పోలిస్తే ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది. కానీ ప్రస్తుతం ఏపీ పైభాగంలో మేఘాలు తక్కువగా ఏర్పడటంతో సూర్యుడి నుంచి నేరుగా కిరణాలు పడటం వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని పేర్కొంది. దీంతో ప్రజలకు అసౌకర్యంతో కూడిన వాతావరణం రాష్ట్రంలో ఏర్పడుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఏపీలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. పైగా వానాకాలంలో వర్షాలు కురిసిన దాఖాలు పెద్దగా కనిపించలేదు.

జూలై నెలలో రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి తప్ప ఆశించిన స్థాయిలో మాత్రం వానలు పడలేదు. వాస్తవానికి ఆగస్టు నెలలో వర్షాలు విస్తారంగా కురవాలి. కానీ అలాంటి పరిస్థితులు రాష్ట్రంలో కనిపించడం లేదు. పైగా భానుడు భగభగ మండిపోతుండడంతో ప్రజలు వేడితో అల్లాడిపోతున్నారు.

# లోకేశ్‌తో ముఖాముఖి.. ఏపీ సర్కార్ వేధింపులపై ఆడిటర్ల ఆవేదన..




గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వ వేధింపులపై ఆడిటర్లు టీడీపీ యువనేత నారా లోకేశ్ ముందు తమ ఆవేదనను వెలిబుచ్చారు. సోమవారం యువగళం పాదయాత్రలో భాగంగా తాడికొండ వద్ద ఆడిటర్లతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ ముందు ఆడిటర్లు తమ బాధను చెప్పుకొచ్చారు. సీఐడీ ద్వారా ప్రభుత్వ వేధింపులను లోకేష్ దృష్టికి ఆడిటర్లు తీసుకొచ్చారు. చార్టెడ్ అకౌంటెంట్లపై ప్రభుత్వం కేసులు పెడుతోందన్నారు. సీఐడీ ద్వారా కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. ఆడిటర్లకు, చార్టెడ్ అకౌంటెంట్లకు సంబంధం లేని వ్యవహారాల్లో కేసులు పెట్టారన్నారు. రాజకీయ కక్షలతో అరెస్టులు చేశారని చెప్పారు. అరెస్టు విషయంలో కనీస నిబంధనలు పాటించలేదని ఆడిటర్లు తెలిపారు. లోకేశ్ మాట్లాడుతూ.. మార్గదర్శిపై ప్రభుత్వం కక్ష సాధిస్తోందన్నారు. ఖాతాదారులు ఫిర్యాదు లేకుండానే వేధించారని తెలిపారు. ఆరు దశాబ్దాలుగా ప్రజల నమ్మకం చూరగొన్న సంస్థ మార్గదర్శి అని.. ఆ సంస్థపై ఇప్పుడు వరకూ ఎలాంటి ఫిర్యాదు లేదన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని మార్గదర్శిపై కక్ష గట్టారన్నారు. రాజకీయాలు వేరు, వృత్తి వేరు.. కానీ వైసీపీ ప్రతిదీ రాజకీయంగా చూస్తోందని మండిపడ్డారు. ఇవన్నీ చూసి మార్గదర్శి వంటి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెడతాయా అంటూ లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టీటీడీ హై లెవెల్ కమిటీ కీలక నిర్ణయాలు ఇవే




తిరుపతి: వన్య మృగాల దాడి నేపథ్యంలో కాలినడకన వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏం చేయాలో చర్చించినట్లు టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి పద్మావతి అతిథి గృహంలో టీటీడీ హై లెవెల్ కమిటీ సమావేశం అయింది. నడకదారుల్లో చిరుతల దాడి నేపథ్యంలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, అటవీ శాఖ ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే చిన్నపిల్లలతో వెళ్లే వారికి అనుమతి ఇవ్వాలని టీటీడీ నిర్ణయించింది. అలాగే సహాయంగా ఊతకర్ర ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు ఘాట్ రోడ్‌లో ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అలాగే భక్తులను గుంపులు.. గుంపులుగా పంపాలని నిర్ణయించారు. నడకదారిలో జంతువులకు తినుబండారాలు ఇవ్వకూడదని భక్తులకు సూచించారు. అలాగే హోటల్స్ వ్యర్థాలు కూడా ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఇక 500 ట్రాప్ కెమెరాలు, డ్రోన్స్ వినియోగించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది.

# అధికారుల అత్యుత్సాహం.. మంగళగిరిలో తెదేపా ఫ్లెక్సీల తొలగింపునకు యత్నం



మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి నగరపాలక సంస్థ సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించారు. బుధవారం నుంచి మంగళగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలుకుతూ పార్టీ నేతలు, కార్యకర్తలు బస్టాండ్ వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

దీంతో వాటిని తొలగించేందుకు నగరపాలక సంస్థ సిబ్బంది యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నేతలు మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. భారీగా పార్టీ నేతలు తరలిరావడంతో నగరపాలక సంస్థ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.




ఉలవపాడు: నెల్లూరు జిల్లాలో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్తున్న హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో చోరీకి పాల్పడ్డారు. ఆ తర్వాత హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లోనూ దోపిడీకి విఫలయత్నం చేశారు. అయితే చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో పోలీసులు అప్రమత్తం కావడంతో దొంగలు పారిపోయారు.

ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా ఉలవపాడు–తెట్టు రైల్వేస్టేషన్ల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను ఉలవపాడు పరిధిలోని సుబ్బరాయుడు సత్రం గేటు వద్ద ఆరుగురు దుండగులు నిలిపివేశారు. అనంతరం దొంగలు రైలులోని ఎస్–1, ఎస్–2, ఎస్–3 బోగీల్లోకి ప్రవేశించి మహిళల వద్ద ఉన్న సుమారు 30 తులాల బంగారాన్ని చోరీ చేశారు. అనంతరం తెట్టు సమీపంలో చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌ను నిలిపి చోరీకి పాల్పడబోతుండగా.. రైలులోని పోలీసలు అప్రమత్తమై వారిని ఎదుర్కొన్నారు.

దీంతో దొంగలు వారిపై రాళ్లు రువ్వి పారిపోయారు. ఆ తర్వాత రైలు ముందుకు కదిలింది. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు ఒంగోలులో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు.

# మంత్రి అమర్నాథ్‌ను కాదు.. నేను సీఎంనే అడుగుతున్నా?



అనకాపల్లి: జగన్ ప్రభుత్వంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరోసారి విరుచుకుపడ్డారు. సోమవారం విసన్నపేట భూములను సందర్శించిన పవన్ ఆపై మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు ఉపాధి లేదని.. జాబ్ క్యాలెండర్ లేదని మండిపడ్డారు. అడ్డగోలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. వోల్టా చట్టం తుంగలోకి తొక్కారన్నారు. ఉత్తరాంధ్ర మీద వైసీపీ ప్రభుత్వానికి ప్రేమ లేదని.. కేవలం ఉత్తరాంధ్ర భూములు మీదే ప్రేమ అంటూ వ్యాఖ్యలు చేశారు. పర్యావరణ విఘాతం కలిగిందన్నారు. ఈ ఉరిలోకి రావడానికి ఇరుకు రోడ్ ఉందని.. కానీ వీరి రియల్ ఎస్టేట్‌కు మాత్రం పెద్ద రోడ్ వేసుకున్నారని మండిపడ్డారు. “మంత్రి గుడివాడ అమర్నాథ్ కాదు.. నేను సీఎంనే అడుగుతున్నాను. ఏంటీ ఈ దోపిడీ, దాష్టీకం” అంటూ ప్రశ్నించారు. కొండలను పిండి చేశారని.. ప్రభుత్వ భూములు, రైతులు భూములను ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

విసన్న పేట భూములు మీద కేంద్ర పర్యావరణ శాఖకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అలాగే గ్రీన్ ట్రిబ్యునల్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

# యువగళం పాదయాత్ర నుంచి ఏకంగా అంగళ్లులో రాళ్లేసారంట!.. అన్నమయ్య పోలీసుల బరితెగింపు




అన్నమయ్య జిల్లా: వైసీపీ కక్ష సాధింపు చర్యలకు వంతపాడుతూ అన్నమయ్య జిల్లా పోలీసు యంత్రాంగం బరితెగింపులకు పాల్పడుతోంది. మంత్రి పెద్దిరెడ్డి కార్యాలయం నుంచి వచ్చిన జాబితాను ఎటువంటి పరిశీలన చేయకుండా ఉన్నది ఉన్నట్టుగా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పెడుతున్న పరిస్థితి. కనీస విచారణ చెయ్యకుండా ఎఫ్ఐఆర్ పేర్లు చేర్చడం పట్ల టీడీపీ నేతలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇటీవల అమెరికాలో ఉన్న వ్యక్తి పేరు పుంగనూరు కేసులో పెట్టిన పోలీసులు ఇప్పుడు మరో తప్పు చేసి నవ్వులపాలయ్యారు. 184 రోజులుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ఫుడ్, కార్యక్రమాల కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న టీడీపీ నేత, రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్‌పై అంగళ్లులో కేసు నమోదు అయ్యింది. అసలు స్పాట్‌లోనే లేని వ్యక్తిపై కేసు ఎలా పెడతారంటూ తెలుగు దేశం నేతలు ప్రశ్నిస్తున్నారు. యువగళంలో ఉన్న నేత అంగళ్లు వెళ్లి రాళు వేసాడంటూ కేసు పెట్టడం పోలీసుల స్వామి భక్తికి పరాకాష్ట అంటూ నేతలు మండిపడ్డారు. ఇలాంటి అక్రమ కేసులతో పోలీసు వ్యవస్థపై ఉన్న నమ్మకం పోతుందని టీడీపీ నేతలు విరుచుకుపడుతున్నారు.




# అయ్యోపాపం.. రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం

చిలకలూరిపేట గ్రామీణం: ఆ అన్నదమ్ముల ఎదుగుదలను చూసి విధికి కన్నుకుట్టిందేమో! రోడ్డు ప్రమాదం ఇద్దరినీ బలిగొంది. కష్టపడి చదివి జీవితాల్లో స్థిరపడిన సోదరులను ఒక్కసారిగా ఈలోకం నుంచి దూరం చేసి కన్నవారికి పుత్రశోకాన్ని మిగిల్చింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడిన కుమారులిద్దరూ ఊహించని ప్రమాదంలో చనిపోవడంతో ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరమూ కావడం లేదు. ఈ విషాదకర ఘటన పల్నాడు జిల్లాలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెం గ్రామానికి చెందిన మోపూరి చెన్నకృష్ణారావు, గోవిందమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కుమారులు రమేశ్ (31), బాలకృష్ణ (29)లను తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. ఇద్దరూ కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు సంపాదించారు. రమేశ్ సీఆర్పీఎఫ్‌లో.. బాలకృష్ణ రైల్వే గేటు కీపర్‌గా పనిచేస్తున్నారు. రమేశ్ విశాఖలో విధులు నిర్వహిస్తున్నారు.

సోమవారం తన సోదరుడు విశాఖ వెళ్తుండటంతో రైలు ఎక్కించేందుకు ఆయన్ను తీసుకుని బాలకృష్ణ ద్విచక్ర వాహనంపై కట్టుబడివారిపాలెం నుంచి బయల్దేరారు. మార్గంమధ్యలో యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద హైవేపై మరమ్మతుల దృష్ట్యా ప్రమాదాల నివారణకు రోడ్డుపై పెట్టిన వేగనిరోధకాల వద్ద బాలకృష్ణ బైక్‌ను నెమ్మదిగా నడిపారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ.. బైక్‌ను ఢీకొట్టి అన్నదమ్ములు ఇద్దరి పైనుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రమేశ్, బాలకృష్ణ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను యడ్లపాడు పోలీసులు చిలకలూరిపేట మార్చురీకి తరలించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడిన ఇద్దరు కుమారుల మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. రమేశ్‌కు భార్య, 6 నెలల పాప ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వెల్లంపల్లి వ్యవహారం చూస్తుంటే బ్రహ్మానందం సినిమా గుర్తొస్తోంది.. పోతిన సెటైర్



విజయవాడ: వైసీపీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు పుట్టినరోజు ఆగస్టు 15 కాదని.. ఆగస్టు 9 అని జనసేన నేత పోతిన వెంకట మహేష్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పుట్టని రోజున పుట్టిన రోజు జరుపుకుంటున్న వెల్లంపల్లి వ్యవహారం చూస్తుంటే బ్రహ్మానందం దీపావళి పండగను వినాయక చవితి రోజున చేసుకున్న పెళ్లి చేసుకుందాం సినిమా సీను గుర్తొస్తుంది అంటూ ఎద్దేవా చేశారు. హిందూ హైస్కూల్లో చదివిన టెన్త్ క్లాస్ సర్టిఫికెట్లు బయటపెట్టి నిజాయితీ నిరూపించుకోవాలని వెల్లంపల్లికి సవాల్ విసిరారు. “మీరు 2014, 2019 ఎన్నికల అఫిడవిట్‌లో టెన్త్ క్లాస్ అని డిక్లరేషన్ ఇచ్చారు. ఆ ఆధారంతోనే నేను వెల్లంపల్లి శ్రీనివాసరావును ప్రశ్నిస్తున్నా.

స్వాతంత్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన వారినీ ఘోరంగా అవమానిస్తున్న వెల్లంపల్లి శ్రీనివాసరావును ప్రజల క్షమించవద్దు” అని పోతిన వెంకట మహేష్ వ్యాఖ్యలు చేశారు.

# మగాడా? కాదా? అన్నది పెళ్లికి ముందే తెలుసుకోవాలి!

సంచలనాల రాంగోపాల్ వర్మ ఒక్కడే వివాదాస్పదుడు అంటే తప్పు! ఆయనతో పాటు ఆయన పరిచయం చేసిన హీరోయిన్లు కూడా కొందరు ఆయనలాగే ఉన్నారని కొంత మంది భామల్లో ప్రూవ్ అయింది. అందుకే వర్మ పల్స్ పట్టుకుని జర్నీ చేయగల్గుతున్నారు. అందాల ప్రదర్శన పక్కనబెడితే ఆయన తరహాలోనే అప్పుడప్పుడు వివాదాస్పద వ్యాఖ్యలతోనూ మీడియాలో హైలైట్ అవుతుంటారు. తాజాగా హట్ బ్యూటీ శ్రీరాపాక పెళ్లికి ముందు శృంగారం గురించి బోల్డ్ గా మాట్లాడింది. మ్యారేజ్ కి ముందు శృంగారంలో పాల్గొనడంలో తప్పులేదని.. అందులో పాల్గొంటేనే అతను మగాడా? కాదా? అనే విషయం తెలుస్తుందని అంది. పెళ్లి జరిగిన తర్వాత అతను మగాడు కాదని తెలిస్తే జీవితాంతం బాధ పడాల్సి వస్తుంది. అదే విషయం



పెళ్లికి ముందే తెలిస్తే ఆ జీవితం మరోలా ఉంటుందంది. దీనికి సాక్షంగా తన స్నేహితురాలి జీవితాన్ని ఉదహరించింది. ఇదే సమయంలో తన స్నేహితురాలికి జరిగిన ఒక అనుభవం గురించి తెలిపింది. –నా స్నేహితురాలు పెళ్లి చేసుకుంది. తొలి రాత్రి అతడు గే అని తెలిసింది. ఈ విషయం నాకు చెప్పి నా స్నేహితురాలు ఎంతో బాధపడింది. ఈరోజుల్లో ఇలాంటి వాటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇలాంటి ఘనటలు రోజు పేపర్లో...టీవీలో వస్తునే ఉన్నాయి. రకరకాల కారణాలతో భార్యభర్తల బంధాలు వీగిపోతున్నాయి. విదేశీ సంబంధాలు అంటూ అలాగే మోసపోతున్నారు. అబ్బాయిలది మాత్రమే తప్పు అనలేదు. అమ్మాయిలు అలాగే ఉన్నారు. రకరకాల కారణాలతో వివాహ వ్యవస్తలు కూలిపోతున్నాయి. ఈ విధానం మారాలని నేను కోరుకుంటున్నా – అని తెలిపింది. వర్మ దర్శకత్వం వహించిన –నగ్నం– సినిమాతో ఈ బ్యూటీ పాపులర్ అయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అమ్మడు సోషల్ మీడియా లో మంచి ప్రాచుర్యం పొందింది. టెంప్టింగ్ ఫోటోలతో యువతని ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటుంది. అప్పుడప్పుడు ఇలా వర్మ తరహా కామెంట్లతోనూ ఆసక్తికరంగా మారుతుంది.

## పుష్ప 2- యానిమల్ తర్వాత రష్మిక మరో జాక్ పాట్

కెరీర్ ప్రారంభించిన ఐదేళ్లలోనే అగ్ర కథానాయికగా ఎదిగేసిన రష్మిక మందన్న నేషనల్ క్రష్ గా భారీ ఫాలోయింగ్ ని ఆస్వాధిస్తోంది. పుష్ప చిత్రంతో పాన్ ఇండియా కథానాయికగా ఓ వెలుగు వెలిగిన ఈ బ్యూటీ తదుపరి పుష్ప 2- యానిమల్ (రణబీర్ హీరో)లాంటి భారీ సినిమాల్లో నటిస్తోంది. ఈ రెండు సినిమాలతో తన స్టార్ డమ్ మరో స్థాయికి రైజ్ అవుతుందని రష్మిక నమ్మకంగా ఉంది. ఇంతలోనే రష్మికను మరో జాక్ పాట్ వరించింది. చియాన్ విక్రమ్- విజయ్ సేతుపతి లాంటి పవర్ హౌస్ హీరోలతో భారీ మల్టీస్టారర్ లో రష్మిక నటించనుందని తెలుస్తోంది. మలయాళ దర్శకుడు 2018 ఫేం జూడ్ ఆంథోని ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. జూడ్ ఇప్పటికే మలయాళంలో వరస బ్లాక్ బస్టర్లతో దూకుడుమీదున్నారు. ఇప్పుడు చియాన్ విక్రమ్- సేతుపతి లాంటి



జాతీయ అవార్డ్ గ్రహీతలతో కలసి పని చేయనున్నాడు. నిజానికి ఇద్దరు టాప్ హీరోలతో పాన్ ఇండియా హీరోయిన్ గా రష్మిక ఎంపిక బిజినెస్ పరంగా ఎంతో హైప్ ని పెంచుతుందనడంలో సందేహం లేదు. జూడ్ ప్రాజెక్ట్ కి రష్మిక మందన ప్రధాన అస్సెట్ కానుంది. అయితే తాజా నివేదికల ప్రకారం, ఈ ప్రాజెక్ట్ కోసం రష్మిక –విజయ్ సేతుపతి పేర్లు ఇంకా ఖరారు కాలేదు. ఇద్దరు తారలతో చర్చలు జరుగుతున్నాయి. అన్నీ ఓకే అయితే అధికారికంగా ప్రాజెక్టును ప్రకటిస్తారు. దీనిని లైకా ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మించనుంది. జూడ్ ఆంథనీ జోసెఫ్ 2014లో 'ఓం శాంతి ఓషానా' పెద్ద విజయం సాధించింది. నజ్రియా నజీమ్, నివిన్ పౌలీ, వినీత్ శ్రీనివాసన్ వంటి ప్రతిభావంతులైన స్టార్లతో ఈ సినిమాని తెరకెక్కించారు జూడ్. 2018 రూపొందించడానికి ముందు మొత్తం మూడు చిత్రాలకు జూడ్ దర్శకత్వం వహించాడు. 2018 చిత్రం భారీ కమర్షియల్ విజయాన్ని అందుకుని మలయాళ సినిమా చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా అవతరించింది. కేరళ వరదల ఆధారంగా రూపొందించిన 2018 సహజసిద్ధంగా తెరకెక్కిన సంగతి తెలిసిందే.




# పూజా అప్డేట్ కోసం ఫ్యాన్స్ వెయిటింగ్..!



బుట్ట బొమ్మ పూజా హెగ్డే మొదట్లో సౌత్ నార్త్ అన్ని చోట్ల సినిమాలు చేసినా ఆమెకు మొదటి హిట్ ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే. అల్లు అర్జున్ తో నటించిన దువ్వాడ జగన్నాథం సినిమా పూజా హెగ్డే కెరీర్ లో ఫస్ట్ హిట్ సినిమాగా నిలిచింది. అయితే అప్పటికే టాలీవుడ్ లో హీరోయిన్స్ కొరత బాగా ఉండటం వల్ల అమ్మడికి వరుస సినిమా ఆఫర్లు వచ్చాయి. స్టార్ సినిమాల్లో కావాల్సిన గ్లామర్ ట్రీట్ కూడా అమ్మడు అందించడం వల్ల పూజా సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. టాలీవుడ్ లో ఉన్న స్టార్స్ అందరితో నటించిన పూజా హెగ్డే తెలుగులో టాప్ హీరోయిన్ గా పాపులారిటీ సాధించింది. అయితే అమ్మడు ఇప్పటికీ మంచి ఫాంలో ఉన్నా సరే సడెన్ గా అవకాశాలు లేక ఖాళీ అయిపోయింది. మహేష్ తో గుంటూరు కారం లో మొదట హీరోయిన్ గా పూజా హెగ్డేని అనుకున్నా సరే ఆమె ఇచ్చిన డేట్స్ లో సినిమా షూటింగ్ వాయిదా పడటం ఆ తర్వాత డేట్స్ అడ్జెస్ట్ చేయలేక సినిమా వదులుకోవడం జరిగిందట. అయితే తీసుకున్న అడ్వాన్స్ కి న్యాయం చేయడం కోసం పూజా హెగ్డే గుంటూరు కారం సినిమాలో ఐటెం సాంగ్ చేయడానికి ఓకే చెప్పిందట. గుంటూరు కారం సరే మిగతా స్టార్స్ ఎందుకు పూజా కు ఛాన్స్ ఇవ్వట్లేదు అన్నది డిస్కషన్స్ లోకి వస్తుంది. అయితే స్టార్స్ అంతా కూడా ప్రస్తుతం వారు చేస్తున్న సినిమాల్లో హీరోయిన్స్ ని ఫిక్స్ చేసుకున్నారు. కమిటైన సినిమాలు పూర్తైతే తమ నెక్ష్ట సినిమాలో పూజా బేబిని తీసుకునే అవకాశం ఉంది. తెలుగులో ఇప్పటికీ సూపర్ క్రేజ్ ఉన్న పూజా హెగ్డే ఆఫర్ల కోసం ఎదురుచూస్తుంది. పూజా సినిమా అప్డేట్ కోసం ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అమ్మడు రెండు మూడు సినిమాల డిస్కషన్స్ లో ఉందని తెలుస్తుంది. బుచ్చి బాబు చరణ్ కాంబోలో వస్తున్న సినిమాతో పాటుగా ఎన్.టి.ఆర్ ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో పూజా హెగ్డేని హీరోయిన్ గా తీసుకోవాలని చూస్తున్నారట. ఆ సినిమాలు ఓకే అయితే మాత్రం పూజా రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంది. ఇప్పటికే సినిమాకు 2 నుంచి 3 కోట్ల దాకా డిమాండ్ చేస్తున్న పూజా పాన్ ఇండియా హిట్లు పడితే మాత్రం ఆ రేటు పెంచే అవకాశం ఉంది.

# నవలల ఆధారంగా రూపొందిన టాప్ 10 సినిమాలు



లెజెండరీ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన పీఎస్ 1, పీఎస్ 2 ఒక నవల స్పూర్తితో తెరకెక్కి ఘనవిజయాలు సాధించాయి. చారిత్రక నవల 'పొన్నియన్ సెల్వన్' ఆధారంగా ఇవి రూపొందాయి. రాజ రాజ చోళ అనే చక్రవర్తి జీవితకథ ఆధారంగా రాసిన నవలలో పాత్రలు ఆద్యంతం రక్తి కట్టించాయి. వాటిని వెండితెరపైనా అంతే ప్రభావవంతంగా మణిరత్నం ఆవిష్కరించారు. రాజులు రాజరికాలు కుట్రలు కుతంత్రాల నేపథ్యంలో పొన్నియన్ సెల్వన్ కథాంశాలు రక్తి కట్టించాయి. పొన్నియన్ సెల్వన్ ఫ్రాంఛైజీ పూర్తిగా నవల ఆధారంగా రూపొంది దాదాపు 500 కోట్లు పైగా వసూలు చేయడం ఒక సంచలనం. ఈ రేంజులో కాకపోయినా కానీ.. బాలీవుడ్ లో ఇంతకుముందు నవలలు పుస్తకాల ఆధారంగా రూపొందిన సినిమాలు ఉన్నాయి. తాజాగా ఈ తరహా సినిమాల జాబితాను పరిశీలిస్తే ఆసక్తికర సంగతులే తెలిసాయి. రాజ్‌కుమార్ హిరాణీ కమింగ్-ఆఫ్-ఏజ్ కామెడీ-డ్రామా 3 ఇడియట్స్ .. చేతన్ భగత్ నవల 'ఫైవ్ పాయింట్ సమ్‌వన్' ఆధారంగా రూపొందింది. ఈ చిత్రం భారతీయ విద్యా వ్యవస్థ లోటుపాట్లను ఎలివేట్ చేస్తూ.. విద్యార్థులు ఆనందంగా జీవితాన్ని ఎలా సాగించాలో చాలా అందంగా ఆవిష్కరించింది. . రాజీ (2018) – హరీందర్ సిక్కా రాసిన 'కాలింగ్ సెహ్మత్' నవల స్ఫూర్తితో తెరకెక్కింది. మేఘనా గుల్జార్ తెరకెక్కిచిన రాజీ .. ఒక రహస్య భారతీయ గూఢచారిగా పనిచేయడానికి పాకిస్తాన్ సైనిక కుటుంబంలో యువకుడిని వివాహం చేసుకున్న యువతి కథతో తెరకెక్కింది. ఆలియా భట్ అద్భుత నటనకు ప్రశంసలు దక్కాయి. ఈ చిత్రం జాతీయ అవార్డులు అందుకుంది. అభిషేక్ వర్మన్ దర్శకత్వం వహించిన 2 స్టేట్స్.. అదే పేరుతో చేతన్ భగత్ రాసిన నవల నుండి ప్రేరణ పొందింది. ఈ చిత్రం వివిధ భారతీయ రాష్ట్రాలకు చెందిన జంటలు ఎదుర్కొనే సాంస్కృతిక ఘర్షణలు సవాళ్లను హాస్యభరితంగా ఆవిష్కరించింది. బ్లాక్ బస్టర్ 'కై పో చే!' (2013) – చేతన్ భగత్ రచించిన 'ది 3 మిస్టేక్స్ ఆఫ్ మై లైఫ్' ఆధారంగా రూపొందింది. అభిషేక్ కపూర్ దర్శకత్వం వహించారు. ముఖ్యమైన చారిత్రక సంఘటనల నేపథ్యంలో స్నేహం, రాజకీయాలను ఆవిష్కరించే ఈ సినిమా ముగ్గురు స్నేహితుల జీవితాలను అన్వేషిస్తుంది. మోహిత్ సూరి 'హాఫ్ గర్ల్‌ఫ్రెండ్' ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. అదే పేరుతో చేతన్ భగత్ రాసిన నవల ఆధారంగా రూపొందింది. ఆధునిక సంబంధాల సంక్లిష్టతలను స్నేహం- శృంగారం మధ్య అస్పష్టమైన రేఖలను అన్వేషించే కథాంశమిది. ఐషా (2010) – జేన్ ఆస్టెన్ రచించిన 'ఎమ్మా' ఆధారంగా రూపొందించిన సినిమా. రాజశ్రీ ఓజా తెరకెక్కించారు. జేన్ ఆస్టెన్ యొక్క క్లాసిక్ నవల ఎమ్మా నుండి ప్రేరణ పొందిన ఐషా కథాంశం ఆసక్తికరం. మోడ్రన్ డే యువతి మ్యాచ్ మేకింగ్ ప్రయత్నాలు శృంగార పరమైన చిక్కుల నేపథ్యంలో ఆద్యంతం రక్తి కట్టించే చిత్రమిది. హైదర్ (2014) – విలియం షేక్స్పియర్ రచించిన 'హామ్లెట్' ఆధారంగా రూపొందింది. విశాల్ భరద్వాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. షేక్స్పియర్ విషాద డ్రామా 'హామ్లెట్'కి ఇది ఆధునిక-కాల అనుకరణ. కాశ్మీర్‌లోని రాజకీయ ఆవేశపూరిత ప్రాంతం నేపథ్యంలో సాగే ఈ చిత్రం ద్రోహం, ప్రతీకారం, రాజకీయ గందరగోళం నేపథ్యంలో తెరకెక్కింది. క్లాసీ రచనలను సినిమా కళాఖండాలుగా ఎలా విజయవంతంగా స్వీకరించవచ్చో ఈ సినిమాలన్నీ నిరూపించాయి. క్లాసిక్ కథలకు ప్రత్యేకమైన భారతీయ దృక్పథాలను జోడిస్తూ అద్భుత కథనాలను వెండితెరపైకి తెచ్చే సృజనాత్మక దర్శకుల సామర్థ్యానికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

# గ్యాప్ ఇవ్వని మిల్కీ బ్యూటీ.. ఈమెకే సాధ్యం

మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి సుదీర్ఘ కాలం అయినా కూడా ఇప్పటికి కూడా బిజీగానే ఉంది. గత మూడు నాలుగు సంవత్సరాలుగా తమన్నా కెరీర్ ఆశాజనకంగా లేదని, కమర్షియల్ గా సక్సెస్ లు దక్కడం లేదని.. ఆమె పనై పోయిందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ అందరి అంచనాలు తారుమారు చేస్తూ బిజీగా ఉంది. సక్సెస్.. ఫ్లాప్ లతో సంబంధం లేకుండా తమన్నా వరుసగా సినిమాలు, సిరీస్ లతో దూసుకు పోతుంది. సినిమాల్లో ఛాన్స్ లు తక్కువ ఉన్న సమయంలో సిరీస్ ల్లో మరియు మ్యూజిక్ ఆల్బం ల్లో కూడా మిల్కీ బ్యూటీ తమన్నా నటిస్తూ ఉంది. తాజాగా భోళా శంకర్ మరియు జైలర్ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జైలర్ సినిమాలో ఈమె పాత్రకు పెద్దగా ప్రాముఖ్యత దక్కలేదు. భోళా శంకర్ సినిమా కూడా ఈమె కెరీర్ కు పెద్దగా హెల్ప్ అయింది లేదు. అయినా కూడా మిల్కీ బ్యూటీ తమన్నా బిజీ గానే ఉంది. నిన్న మొన్ననే ఆ రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తమన్నా వెబ్ సిరీస్ తో రెడీ అవుతోంది. ఆఖ్రీ



సచ్ అనే వెబ్ సిరీస్ తో తమన్నా ఈనెల 25న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఢిల్లీలోని బురారీ మరణ ఘటన ఆధారంగా రూపొందించిన ఈ వెబ్ సిరీస్ పై అంచనాలు భారీగా ఉన్నాయి. తాజాగా విడుదల అయిన ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ రావడంతో సిరీస్ మంచి స్పందన దక్కించుకుంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. రాబీ గ్రేవాల్ దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ లో అవిషేక్ బెనర్జీ, శివాని నారంగ్, కృతి విజ్, సంజీవ్ చోప్రా, రాహుల్ బగ్గా, నిఖిల్ నంద వంటి ముఖ్య నటీ నటులు నటించారు. ఈ సిరీస్ లో తమన్నా పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందనే టాక్ వినిపిస్తుంది. ఈ సిరీస్ విడుదల అయిన వెంటనే తమన్నా మళ్లీ సినిమాలు, సిరీస్ లతో రెడీగా అయ్యే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి మిల్కీ బ్యూటీ తమన్నా చిన్న గ్యాప్ కూడా ఇవ్వడం లేదు.

సీనియర్ హీరోయిన్స్ లో ఇంత బిజీగా ఉండటం కవేలం తమన్నాకే చెల్లింది అంటూ ఆమె అభిమానులతో పాటు ఇండస్ట్రీ వర్గాల వారు ఇకా మీడియా సర్కిల్స్ వారు మాట్లాడుకుంటున్నారు. ఇదే జోష్ తో కొనసాగితే మరో అయిదు ఆరు సంవత్సరాల పాటు తమన్నా వినోదాన్ని పంచే అవకాశాలు కనిపిస్తున్నాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## రెచ్చగొట్టే విధంగా అందాల 'ఖుషి'

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హిందీలో పలు సినిమాల్లో సిరీస్ ల్లో నటించిన జాన్వీ సక్సెస్ దక్కించుకోకున్నా కూడా తన హాట్ ఫోటోలతో పాపులారిటీని సొంతం చేసుకుంది. ఆ పాపులారిటీ వల్లే ఎన్టీఆర్ కు జోడీగా దేవర సినిమాలో నటించే అవకాశం ను దక్కించుకున్న విషయం తెల్సిందే. అక్క దారిలోనే ఖుషి కపూర్ కూడా అందాల ఆరబోత చేయడం మొదలు పెట్టింది. ఇండస్ట్రీలో చాలా కాలంగా ఉంటున్న ఖుషి కపూర్ ఈ మధ్య కాలంలో హీరోయిన్ గా మెల్ల మెల్లగా అడుగులు వేసే ప్రయత్నాలు చేస్తోంది. అందుకు గాను ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ తో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని



ఆకర్షిస్తున్నాయి. క్లోజప్ లో క్లీ వేజ్ షో తో మతి పోగొడుతున్న ఈ అమ్మడి అందాల ఆరబోతకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.

ఈ రేంజ్ లో అందాల ఆరబోత తో అక్క జాన్వీ కపూర్ కి తక్కువేం కాదు అన్నట్లుగా చెప్పేందుకు ప్రయత్నాలు చేస్తుంది అనిపిస్తుంది. అతిలోక సుందరి నట వారసురాలిగా ఖుషి కపూర్ కి మంచి ఫాలోయింగ్ ఉంది. ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ ను షేర్ చేయడం ద్వారా బాలీవుడ్ తో పాటు సౌత్ లో ముఖ్యంగా టాలీవుడ్ లో వరుస ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు లేకపోలేదు అన్నట్లుగా మీడియా సర్కిల్స్ లో టాక్ నడుస్తోంది.

# కెసిఆర్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి, రాష్ట్రమే కాదు యావత్ దేశం తెలంగాణ వైపే చూస్తుందన్న మంత్రి మల్లారెడ్డి...

## ముచ్చటగా మూడోసారి గెలిచేందుకు పావులు కదుపుతున్న మంత్రి మల్లారెడ్డి....

### గ్రామంలో అధికంగా ఉండే సామాజిక వర్గానికి చెందిన మాజీ సర్పంచ్, ప్రస్తుత ఎంపీటీసీ కోడూరు అశోక్ ను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి మల్లారెడ్డి

### కెసిఆర్ చేస్తున్న అభివృద్ధి పనులతో పాటుగా, గ్రామ అభివృద్ధి కొరకే బిఆర్ఎస్ పార్టీలో చేరానన్న కోడూరు అశోక్...



మేడ్చల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధి వల్లే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఉత్తమ గ్రామపంచాయతీ పరీక్షల్లో నెగ్గి ఒక తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయతీలు మాత్రమే 30% పురస్కారాలు అందుకోగా, మిగతా డబ్బే శాతం యావత్ దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామపంచాయతీలు ఉత్తమ పురస్కారాలు అందుకున్నాయన్నారు. వలసల జిల్లాలు, ఎండిన చెరువులు, బీడు భూములుగా ఉన్న తెలంగాణను... సస్యశ్యామలం చేసి యావత్ భారతదేశంలోనే ఒక తెలంగాణ రాష్ట్రానికే 30% మేర ఉత్తమ గ్రామ పంచాయతీల పురస్కారాలు అందాయంటే, అది కచ్చితంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన దక్షతకు నిదర్శనమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. సోమవారం మంత్రి మల్లారెడ్డి షామీర్పేట్ మండలంలో పర్యటించి.. షామీర్పేట్ గ్రామంలో సుమారు కోటి రూపాయల నిధులతో చేస్తున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ముచ్చటగా మూడోసారి కూడా తన విజయ పరంపరను కొనసాగించేలా మంత్రి మల్లారెడ్డి అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే షామీర్పేట్ మండలం, అలియాబాద్ గ్రామంలో అధిక సామాజిక వర్గానికి చెందిన మాజీ సర్పంచ్, ప్రస్తుత ఎంపీటీసీ కోడూరు అశోక్ ను బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోడూరు అశోక్ తో పాటుగా పడిగే రవీందర్, హనుమాన్ల విజయ్ కుమార్, టిల్లు, రామచందర్, అవినాష్, భాస్కర్, రవితో పాటుగా సుమారు 100 మంది యువత మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... అలియాబాద్ గ్రామ అభివృద్ధికై తాను తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా బిఆర్ఎస్ పార్టీలో చేరిన అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ ప్రస్తుత ఎంపీటీసీ కోడూరు అశోక్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు, అదేవిధంగా మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి తన అలియాబాద్ గ్రామ అభివృద్ధికై తాను బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లుగా కోడూరు అశోక్ తెలిపారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి గ్రామంలోని జనార్దన్ నగర్ కాలనీలో తన సొంత నిధులతో రోడ్డు పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. కాగా రెండు రోడ్లు వేయనునట్లుగా హామీ ఇచ్చి, ఒకటే రహదారి పనులను పూర్తి చేయడం, మరొకటి కనీసం ప్రారంభించక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లుభాయ్, జడ్పిటిసి అనిత, మండల అధ్యక్షుడు సుదర్శన్, కమటం కృష్ణ రెడ్డి, గ్రామ సర్పంచ్ గుర్క్ కుమార్, జగదీష్ గౌడ్, వార్డుమెంబర్ లింగంతోపాటుగా రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కామారెడ్డిలో అభివృద్ధి పనుల కోసం రూ.45 కోట్లు : మంత్రి కేటీఆర్

కామారెడ్డి : కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.45 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. సోమవారం అయన రోడ్లు, భవనాల శాఖా మంత్రి వేముల వేముల ప్రశాంత్ రెడ్డితో కలిసి కామారెడ్డి జిల్లా కేంద్రంలో రూ.28 కోట్లతో నిర్మించిన ఆరు లేన్ల రహదారి, స్వాగత తోరణం, సెంట్రల్ లైటింగ్, మీడియన్, రోడ్డు డివైడర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ చౌరస్తా వద్ద కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో.. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కామారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. దాదాపు రూ. 28 కోట్లతో సెంట్రల్ లైటింగ్, ఆరు వరుసల రోడ్డు, స్వాగత తోరణం, సెంట్రల్ మీడియన్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని అన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం రూ. 25 కోట్లు మంజూరు చేయాలని గంప గోవర్ధన్, సీఎం కేసీఆర్‌ను కోరగా, రూ. 25 కోట్లు మంజూరు చేస్తూ ఈ రోజే ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. అలాగే పట్టణంలో మున్సిపల్ డిపార్ట్‌మెంట్ రోడ్లు, స్టేడియం కోసం, అంతర్గత రహదారుల కోసం రూ. 20 కోట్లు మంజూరు చేయాలని, కోరగా తానూ మంజూరు చేసినట్లు తెలిపారు.

సౌమ్యుడైన గంప గోవర్ధన్ కామారెడ్డి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించి, జిల్లా కేంద్రంగా మార్చి, కలెక్టర్, ఎస్పీ కార్యలయాలు, మెడికల్ కళాశాల, సువిశాల రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేస్తున్నారని మంత్రి కేటీఆర్ ప్రశంసించారు.

## ఎమ్మెల్యే సురేందర్ కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు.. మంత్రి కేటీఆర్ ప్రశంసలు



కామారెడ్డి : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. పైసల కోసమో, పదవుల కోసమో సురేందర్ ప్రజా జీవితంలోకి రాలేదు. తెలంగాణ రావాలని కేసీఆర్‌తో కలిసి నడిచిండు. సురేందర్‌ను ఈసారి 70 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలి. అభివృద్ధి మరింత చేస్తున్నాం. శాశ్వతమైన ఎమ్మెల్యేగా సురేందర్ రెడ్డిని చేసుకుందాం అని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. 2018లో రాష్ట్రం మొత్తంలో 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిస్తే.. అత్యధిక మెజార్టీతో సురేందర్ గెలిచారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకుల వల్ల నేను గెలువలేదని సురేందర్ చెప్పారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం ప్రజల దయతోనే గెలిచాను అని ఆయన చెప్పినట్లు కేటీఆర్ గుర్తు చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను పాటు పడుతున్నానని సురేందర్ తెలిపారని కేటీఆర్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం మొత్తం అభివృద్ధి పథంలో బ్రహ్మాండంగా ముందుకు పోతోందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్‌ను, మంత్రులను సురేందర్ ఎప్పుడు కలిసినా మా నియోజకవర్గం వెనుకబడింది.. నిధులు కేటాయించాలని అడుగుతారని కేటీఆర్ గుర్తు చేశారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం రూ. 20 కోట్ల 31లక్షల నిధులు మంజూరు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఈ ఒక్క నియోజకవర్గంలోనే 1,03,348 మంది రైతులకు రైతుబంధు అందుతున్నదని పేర్కొన్నారు. 2001 నుంచి కేసీఆర్‌కు తమ్ముడిలా సురేందర్ 119 నియోజకవర్గాల్లో వెన్నంటి నడిచారని కేటీఆర్ పేర్కొన్నారు. నాడు మూడు పెద్ద శక్తులను తట్టుకొని కేసీఆర్ పార్టీని స్థాపించారు. కేసీఆర్‌కు మనీ పవర్ లేదు. మజిల్ పవర్ లేదు. మీడియా బలం లేదు. ఇతర హంగులు లేవు. సినిమా యాక్టర్ కాదు. డబ్బు లేదు. ఆయన ఎత్తుకున్న అంశంలో కేవలం నిజాయితీ మాత్రమే ఉన్నది. ఆయన మాటల్లో నిప్పులు ఉన్నాయి కాబట్టి ఆనాడు తెలంగాణ మొత్తం అగ్గిలా మండింది. రాష్ట్రం ఏర్పడింది. 2001లో కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నికల్లో 12 మండలాలకు గానూ 10 మండలాల్లో టీఆర్ఎస్‌ను గెలిచిందని కేటీఆర్ గుర్తు చేశారు.




దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ.. సైనిక, పోలీసు అధికారులకు వివిధ పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 954 మందికి పోలీసు పతకాల ను అందజేయనుంది. ఈ మేరకు సోమవారం అవార్డుల జాబితాను విడుదల చేసింది. ఇందులో 229 మందికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 82 మంది పోలీసులకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 642 మందికి పోలీస్ విశిష్ట సేవా (పోలీసు మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) పతకాలను ప్రకటించింది. పోలీస్ మెడల్స్ ఫర్ గ్యాలంట్రీ పతకాలు దక్కించుకున్నవారిలో అత్యధికంగా జమ్మూకశ్మీర్ నుంచి 55 మంది పోలీసులు ఉన్నారు. ఆ తర్వాత మహారాష్ట్ర నుంచి 33, సీఆర్పీఎఫ్ నుంచి 27, ఛత్తీస్‌గఢ్ నుంచి 24 మందికి పీఎంజీ పతకాలు దక్కాయి. ఈసారి అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంట్రీ పోలీసు పతకం ఒకరిని వరించింది. సీఆర్పీఎఫ్ అధికారి లౌక్రక్‌పామ్ ఇబోంచా సింగ్‌కు ఈ పురస్కారాన్ని ప్రకటించారు.

**తెలుగు రాష్ట్రాల వారికి ఇలా..** ఈ అవార్డుల్లో తెలంగాణ నుంచి 34, ఆంధ్రప్రదేశ్ నుంచి 29 మందికి ఈ పతకాలు దక్కాయి. తెలంగాణలో 22 మందికి పోలీస్ మెడల్స్ ఫర్ గ్యాలంట్రీ (పీఎంజీ), ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీసు పతకం (పీపీఎం), 10 మందికి పోలీస్ విశిష్ట సేవా పతకాలు ఇవ్వనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 18 మందికి పోలీస్ మెడల్స్ ఫర్ గ్యాలంట్రీ (పీఎంజీ), ఒకరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీసు పతకం (పీపీఎం), 10 మందికి పోలీస్ విశిష్ట సేవా పతకాలు ప్రకటించారు. తెలంగాణ నుంచి అదనపు డీజీ విజయ్ కుమార్, ఎస్పీ మాదాడి రమణ కుమార్.. ఆంధ్రప్రదేశ్ నుంచి అదనపు డీజీ శంకబ్రత బాగ్చి రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకం అందుకోనున్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ ఏటా రెండు సార్లు ఈ పోలీసు పతకాలను ప్రకటిస్తుంది.

## 19న మెదక్‌కు సీఎం కేసీఆర్.. ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి హరీశ్‌రావు



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 19న మెదక్ జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో సమీకృత కలెక్టరేట్ భవనంతో పాటు జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని సైతం ప్రారంభించనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యాలయాల పనులను సందర్శించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆ తర్వాత బహిరంగ సభ జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. సభకు తరలివచ్చే వారి కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నేతలకు సూచించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్, ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి, కలెక్టర్, ఎస్పీతో పాటు ఇతర ఉన్నత అధికారులు ఉన్నారు.

## బతుకమ్మ సంబురాలకు భారత్ జాగృతి సన్నాహాలు.. గాయకులతో కలిసి పాటపాడిన ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: బతుకమ్మ సంబరాలకు భారత్ జాగృతి సన్నాహాలు మొదలుపెట్టింది. భారత్ జాగృతి ఆధ్వర్యంలో రాబోతున్న బతుకమ్మ పాటకు సంబంధించిన వీడియోను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. ప్రముఖ గాయకులు తేలు విజయ, పద్మావతి, మౌనిక యాదవ్, సౌమ్యతోపాటు భారత్ జాగృతి సాంస్కృతిక విభాగం జాతీయ కన్వీనర్ కోడారి శ్రీనుతో కలిసి కవిత పాటపాడారు. జాగృతి యాప్‌లో ఇప్పటికే దాదాపు 150 బతుకమ్మ పాటలు ఉన్నాయి. కాగా, ప్రజల సహకారంతో అరుదైన, ప్రాచీన, కొత్తగా పూర్తిచేసిన బతుకమ్మ పాటలను సేకరిస్తున్నది. దీనికోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్ 091 8985699999ను కేటాయించింది. ఆ నంబర్‌కి వాట్సాప్ ద్వారా పాటలను పంపించాలని ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు. అంతేకాక తమకు ఇష్టమైన బతుకమ్మ పాటలను సామాజిక మాధ్యమాల్లో భారత్ జాగృతికి ట్యాగ్ చేస్తూ పోస్టులు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలు సేకరణ, రూపకల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించిన జాగృతి సాంస్కృతిక విభాగం జాతీయ కన్వీనర్ కొడారి శ్రీనును అభినందించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com